ప్రాణ.. స్నేహితులే!



సీతపల్లి వాగులో పడి మృతిచెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులు

మృత్యువూ వారి స్నేహాన్ని విడదీయలేకపోయింది.. ఎప్పుడూ ఒకరి వెంట ఒకరుగా ఉండేవాళ్లు.. మృత్యువులోనూ ఒక్కటిగానే తిరిగిరాని లోకాలకు తరలిపోయిన విషాదఘటన ఇది.. జిల్లాలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు స్నేహితులు మృతిచెందారు.. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సెలవు కావడంతో విహారయాత్రకు సీతపల్లివాగుకు వెళ్లారు.. అప్పటి వరకూ ఎంతో సరదాగా గడిపారు.. ఫొటోలు తీసుకున్నారు.. తిరిగివచ్చేసే సమయం దగ్గరపడుతుండడంతో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ముగ్గురు స్నేహితులు సీతపల్లివాగులో స్నానానికి దిగారు.. మరో ఇద్దరు గట్టుపై ఉన్నారు.. అయితే అరగంట తర్వాత స్నానానికి దిగిన ముగ్గురు నీట మునిగి మృత్యువాతపడ్డారు. మరో ఘటనలో అనపర్తికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు.. ఆదివారం కావడంతో నలుగురు యువకులు సరదాగా యానాం వెళ్లి తిరిగివస్తుండగా లారీని దాటించబోయి ఎదురుగా ఉన్న గొయ్యిలో పడి ఇద్దరూ మృతిచెందారు.. ఎప్పుడూ తమ మధ్య సరదాగా తిరిగే ప్రాణ.. స్నేహితులు.. ప్రాణాలతో లేకపోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. - 7లో



మీకు నేనున్నా: దళిత గర్జన సభకు భారీగా హాజరైన జనం.. దళితుల సమస్యలు వింటున్న మాజీ ఎంపీ హర్షకుమార్

జగన్‌కు ఓటేయకండి..
దళిత గర్జన సభలో హర్షకుమార్



దగాపడ్డ దళితులంతా తిరగబడాలి.. సీఎం జగన్‌ను గద్దె దింపాలి.. ఐదేళ్ల కిందట ఎన్నికల ముందు దళితులకు అది చేస్తా.. ఇది చేస్తా అని హామీ ఇచ్చాడు.. చివరికి చేసిందేం లేదు.. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు మాత్రం పెరిగాయి.. అంటూ వేమగిరిలో ఆదివారం జరిగిన దళిత సింహగర్జన సభలో మాజీ ఎంపీ హర్షకుమార్ వైసీపీ ప్రభుత్వ తీరుపై గర్జించారు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఓటుకు రూ.10 వేలు ఇస్తారు.. తీస్కోండి.. ఓటు మాత్రం వైసీపీకి వేయకండని పిలుపునిచ్చారు.. ఈ సభ నాకోసం కాదు.. మీ కోసమే..ఇది దళితుల ఆత్మగౌరవ సభ అన్నారు.. - వివరాలు 7లో



7 కేజీలు రూ.100

- భారీగా దిగొచ్చిన ఉల్లి ధర
- మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతులు
- ఆటోలపై రూ.100కి ఏడు కిలోలు
- రైతు బజార్లలో మాత్రం తగ్గని ధర
- ఇంకా కిలో రూ.20లకే విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : ఉల్లిపాయల ధరలు దిగొస్తున్నాయి. గత రెండు, మూడు రోజుల నుంచి ఉల్లిపాయల ధరల్లో అనూహ్యమైన తగ్గుదల కనిపిస్తోంది. మహారాష్ట్రలో కొత్త పంట చేతికి రావడంతో డిమాండ్ కంటే ఎక్కువగా దిగుమతులు పెరడమే ధరలు తగ్గుదలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో ఉల్లిపాయల లోడు లారీలు మార్కెట్‌కు వస్తుండడంతో ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు వచ్చిన పాయలను వచ్చినట్టే బహిరంగ మార్కెట్లకు పంపిస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌కు నాలుగు, ఐదు లారీలు వచ్చేవని, ఇప్పుడు ఏకంగా పది నుంచి పదిహేను వరకూ లారీ లోడ్లు వస్తున్నాయని చెబుతున్నారు. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లోనే ధరలు నేలచూపులు చూస్తున్నాయి.

ఆటోలపై ఇంటింటికీ ఉల్లి

హోల్‌సేల్ మార్కెట్‌లోనే ఉల్లిపాయల ధర తక్కువగా ఉండడంతో ఆటోలు, తోపుడుబండ్లపై ఇంటింటికీ తీసుకొచ్చి విక్రయించే వ్యాపారులు రూ.100లకే ఏడు కిలోలు అంటూ ఊదరగొడుతున్నారు. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి పది కిలోలు రూ.90-100లకు కొనుగోలు చేసి రవాణాఖర్చులు, కొంత లాభం వేసుకుని తక్కువకే ఇళ్లవద్ద విక్రయిస్తున్నారు. అయితే రైతు బజార్లలో మాత్రం కిలో రూ.20లకు తగ్గడంలేదు. నిజానికి బహిరంగ చిల్లర మార్కెట్ల కంటే రైతుబజార్లలోనే ధరలు తక్కువగా ఉండాలి. కానీ తాము నాణ్యత కల్గిన పాయలు తెస్తున్నామని, ధర తగ్గిస్తే గిట్టుబాటు కాదని రైతు బజార్లలోని వ్యాపారులు చెబుతున్నారు.

కొత్తపాయలు నిల్వకు ఆగవు ..

మహారాష్ట్రలోని షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భారీగా ఉల్లిపాయలు మార్కెట్లకు వస్తున్నా అవన్నీ కొత్తపాయలు కావడంతో నిల్వకు ఆగే పరిస్థితి లేదు. దీంతో బస్తాలకు, బస్తాలు కొనుగోలు చేసుకుని నిల్వచేసుకునే అవకాశం ఉండదు. ఆరుదలపాయ కాకపోవడంతో త్వరగా కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. ఒకేసారి 25, 30 కేజీల కొనుగోలు చేసుకున్నా ప్రయోజనం ఉండదు. హోటళ్లు, కర్రీపాయింట్ల వారికి ఈ ధరల తగ్గుదలతో ఉపయోగం ఉంటుందని చెబుతున్నారు.



ఫ్యాన్ కింద గుబులు
తూర్పున వేడెక్కిన రాజకీయం

- టీడీపీ,జనసేన, బీజేపీ పొత్తు?
- కేడర్‌లో పెరుగుతున్న జోష్
- పెరిగిన ఆశావహుల సంఖ్య
- టీడీపీ,జనసేనలో చేరికలు
- పొత్తు తర్వాతే అభ్యర్థుల ప్రకటన
- వైసీపీ వెన్నులో వణుకు
- మరో పక్క జగనన్న బాణం దెబ్బ
- తేలని ముగ్గురి భవితవ్యం
- దిగాలు పడిన నాయకులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది.. వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ కార్యక్రమాలను వేగవంతం చేశాయి. టీడీపీ-జనసేనలతో బీజేపీ కూడా పొత్తు సిద్ధమవుతుందనే సంకేతాలతో కేడర్‌లో మరింత జోష్ పెరిగింది.దీంతో వైసీపీలో వణుకుపుడుతోంది. టీడీపీ- జనసేన పొత్తువల్లే డీలా పడిన వైసీపీ, ఇవాళ టీడీపీతో బీజేపీ కూడా కలుస్తుందనే సమాచారంతో మరింత దిగాలు పడింది. మరో పక్క పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన అన్న సీఎం జగన్‌ను ఏకి పారేస్తుండడం, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతుండంతో వైసీపీ ఆందోళనకు గురవుతుంది. వైసీపీ అభ్యర్థులను బదిలీ చేసినా..కొత్త వర్గాలను తెరమీదకు తెచ్చినా ఆయా వర్గాల్లో కూడా వైసీపీ పట్ల నమ్మకం లేకపోవడం గమనార్హం. ఇవాళ అన్ని వర్గాల్లోనూ రాజకీయ చైతన్యం పెరగడం వల్ల ఒక వర్గానికి ఇస్తే మరొక వర్గం ఇబ్బంది పడుతోంది.ఈ పరిస్థితుల్లో ప్రజలు అభివృద్ధి, శాంతిభద్రతలు, ప్రశాంత వాతావరణం, మౌలిక వసతులు కల్పించడం, విద్య, ఆరోగ్యం వంటివాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వైసీపీ అనేక సంక్షేమ పథకాలు ఇచ్చినట్టు చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లే దు. ఇటీవల చాగల్లులో జరిగిన రచ్చబండలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల సంక్షేమ పథకాల గుట్టు రట్టు చేసిన సంగతి తెలిసిందే. అమ్మఒడి అంటే ఒకే బిడ్డేనా, ఇంకో బిడ్డ ఉంటే చదువుకో కూడదా అంటూ జగన్ వైఖరిని తీవ్రంగా ఖం డించిన సంగతి తెలిసిందే. అసలు అమ్మఒడికింద రూ.12వేలు ఇస్తే, అది చదువుకు సరిపోతుందా అని కూడా ఆమె ప్రశ్నించారు. మట్టిబిందె ఇచ్చి, వెండి బిందె లాగేసుకుంటున్నారని విమర్శించారు. ఒక్క హామీ అమలుచేయని జగన్ వైఎస్ఆర్ వార సుడు ఎలా అవుతాడని కూడా ప్రశ్నించారు. ఇదే కోణంలో ప్రజలు ఆలోచిస్తున్నారు.ఈ పరిస్థితి వైసీ పీని ఇరకాటంలో పడేసింది.వైసీపీ ఇంకా ముగ్గురు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చని సంగతి తెలిసిందే. ఇది కూడా ఆయా అభ్యర్థులు, కేడ ర్‌లోనూ అనుమానాలు పెంచుతోంది. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో వైసీపీ మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టినట్టయింది. కొవ్వూరు లో హోం మంత్రి తానేటి వనిత హయాంలో మాల లకు అన్యాయం జరిగిందనే కారణంతో గతంలో మాల లంతా ఒకతాటిపైకి రావడం తెలిసిందే. ఇవాళ మాదిగ వర్గానికి చెందిన మంత్రి తానేటి వనితను గోపాలపురం పంపించడంతో కొవ్వూ రులో మాదిగ వర్గం చిన్నబుచ్చుకుంది. గోపాలపురంలో ఎమ్మెల్యే మాలవర్గానికి చెందిన తలారి వెంకటరావును కొవ్వూరు తీసుకురావడంతో గోపాలపురంలో మాల వర్గం చిన్నబుచ్చుకుంది. ఇక్క డంతా తమ జాతి నాయకత్వాలను ఎదగనీయడం లేదనే ఆలోచనతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. టీడీపీలో ఇంకా అభ్యర్థులను అధికారికంగా ప్రక టించలేదు. కొన్నిచోట్ల లోపాయికారిగా సమాచారం అందినప్పటికీ చాలా చోట్ల ఇంకా ఎవరు అభ్యర్థి అనేది తేలలేదు. టికెట్లు విషయం అనేది అధిష్ఠానానికి సంధించినది. కానీ కేడర్, ప్రజలు మాత్రం అభ్యర్థి ఎవరైనా మాకు పార్టీ ముఖ్యమనే స్థాయికి వచ్చారు. రాజమహేంద్రవరం సిటీ, అనపర్తి, గోపాలపురం అభ్యర్థుల విషయంలో తెలుగుదేశం అధిష్ఠానం ఒక స్పష్టతకు రాగా, రాజానగరం విషయంలో జనసేన అభ్యర్థి పేరు ప్రకటించకపోయినా, అక్కడ నుంచి జనసేన పోటీ చేస్తుందనే విష యాన్ని ధ్రువీకరించింది. ఇక రాజమహేంద్ర వరం రూరల్ నుంచి ఎవరు పోటీ చేస్తారనేది అధిష్ఠా నం తేల్చవలసిందే. సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఖాయమని చంద్రబాబు గతంలో ప్రకటించడంతో తనకే టికెట్ అని ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి చెబుతున్నారు. అంతేకాక ఇక్కడ మరో వాదన వినిపిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో నాలుగు నియోజకవర్గాల్లో కమ్మ వర్గీయులకు టికెట్లు ఇచ్చేవారు.ఇప్పటికే పెద్దాపురం,రాజానగరం నియోజకవర్గాల నుంచి కమ్మ వర్గాన్ని తప్పించారు. ఇక మండపేట, రాజమహేంద్రవరం రూరల్ ఉం ది. అందులో ఇంకొకటి కూడా తప్పిస్తే ఎలా అనే వాదన వినిపిస్తోంది.ఇక జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడు కందుల దుర్గేష్ కూడా టికెట్ తనకేనని, తనకు తమ అధినేత పవన్ కల్యాణ్ మాటిచ్చారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సీటు ఎవరిదనేది తేలడానికి మరి కొద్దిరోజులు పడుతుంది. కొవ్వూరు నియోజక వర్గంలో కూడా రెండు వర్గాల మధ్య అధిపత్య పోరు. అక్కడ కూడా అధిష్ఠానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఖరారవుతారు. నిడదవోలు మాజీఎమ్మెల్యే బూ రుగుపల్లి శేషారావు, సీనియర్‌నేత కుందుల సత్యనారాయణ మధ్య టికెట్ కోసం హోరాహోరీ పోరు నడుస్తోంది.కానీ ఇంకా అభ్యర్థుల విష యంలో స్పష్టత లేకపోయినా, జిల్లాలో టీడీపీ-జనసేన కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఐక్యంగా పనిచేస్తుండడం గమనార్హం.రాజమహేంద్రవరం సిటీలో ఆదివారం టీడీపీలో పలువురు చేశారు. పెద్దర్యాలీ నిర్వహించారు.అనపర్తి ఆది బ్యాచ్ పేరిట వందలాది మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఇప్పటికే గోపాలపురంలో కూడా భారీఎత్తున చేరికలు ఉన్నాయి. జిల్లాలో అనేక చోట్ల టీడీపీ నేతలు పార్టీ కార్యాలయాలను ఎన్నికల కోసం సిద్ధం చేసుకుంటున్నారు. బీజేపీతో పొత్తు తేలిన తర్వాత, టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను ఒకేసారి ప్రకటిస్తారనే ప్రచారం సాగుతోంది. చంద్రబాబు హయాంలోని టీడీపీ ఆచితూచి అడుగులు వేస్తుండడంతో సీఎం జగన్ అయోమ యంలో పడుతున్నారు.ఈ నేపథ్యంలోనే టీడీపీ అభ్యర్థులను ప్రకటించే వరకూ వేచి చూస్తున్నారు.

ఆ ఇంట్లో ఏమైంది!

- కాలిన గాయాలతో తండ్రి, ఇద్దరు చిన్నారులు
- ఇంట్లో నుంచి పొగలు.. గుర్తించిన స్థానికులు
- గ్యాస్ లీకైందంటున్న తండ్రి.. భార్యతో గొడవలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య గొడవలతో అభంశుభం తెలియని చిన్నారులు నలిగిపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీకి చెందిన గూడి సాయి కిరణ్‌కి యర్రవరానికి చెందిన దుర్గతో ఆరేళ్ల కిందట వివాహమైంది.కొంతకాలంగా ఇద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొడుకు సందీప్(4), ఏడాదిన్నర కూతురితో ఆమె అమ్మ గారింటికి వెళ్లిపోయింది. గత నెల 21న అత్తగారింటికి వెళ్లిన సాయి గొడ వపడి తన ఇద్దరు పిల్లలను తీసుకొని వచ్చేశాడు. ఏమైందో ఏమో గానీ ఆదివారం అతడి ఇంట్లో నుంచి పొగరావడం గమనించి వెళ్లి భయాం దోళన చెందారు.అప్పటికే అతడు,పిల్లలు తీవ్రగాయాలతో ఉన్నారు. వాళ్ల ను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.గ్యాస్ లీకై మం టలు అంటుకున్నాయని సాయి చెప్పాడు.అయితే పిల్లలకు కాళ్లు, చేతు లు, తలపై కాలిన గాయాలున్నాయి. గ్యాస్ లీకై మంటలు వ్యాపించి నట్టుగా వారి పరిస్థితి లేదు. దీంతో సాయి కిరోసిన్ వేసి నిప్పంటించి ఉంటాడని భావిస్తున్నారు.ముగ్గురినీ మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.తల్లి దుర్గ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నారని, ఆమె నేరుగా కాకినాడ వెళ్లారని..ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఫిబ్రవరి 11 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేషపూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి,నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు.అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేసారు. ఆదివారం అమ్మ వారికి మొత్తం రూ.1,74,441లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వ హణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.





పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ జగదీశ్

ఎన్నికల విధులు బాధ్యతగా చేయాలి

- లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేస్కోండి
- బోర్డర్ చెక్‌పోస్టులు బలోపేతం చేయాలి
- అవగాహన సదస్సులో ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులను ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి, ఎన్నికల ప్రక్రియలపై పోలీస్ అధికారులకు ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని వివరించాలన్నారు. గ్రామ పెద్దలతో శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి,సారా,మద్యం, నగదు తదితర వాటి రవాణా అరికట్టడానికి బోర్డర్ చెక్ పోస్టులను బలోపేతం చేయాలన్నారు. ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి వాటి నుంచి ఎన్నికల అధికారులు, ఓటర్లకు భద్రత కల్పించాలని తెలిపారు. లైసెన్స్‌లేని ఆయుధాలు, మందుగుండు సామగ్రి సీజ్ చేయాలన్నారు. రౌడీ షీట్లు,పరారీలో ఉన్న నేరస్తులు, దూకుడుగా వ్యవహరించే కార్యకర్తలు, కుల/ మతపరమైన వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ శాఖలోని అందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో కేసుల నమోదు, కోర్టు ముందు ఉంచే ప్రక్రియ తదితర విషయాలపై ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టీవీఎస్ ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు,సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలల పండుగ

- ఉత్సాహంగా గోదావరి బాలోత్సవం
- రెండు రోజుల పాటు పిల్లలకు పండగే
- హాజరైన 5600 మంది చిన్నారులు
- అన్ని విభాగాల్లో అలరించారు..



బాలికకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ కమిషనర్ జితేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన గోదావరి బాలోత్సవం పిల్లల పండుగ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ మాజీ కమిషనర్ ఎం.జితేంద్ర మాట్లాడుతూ మంచి సమాజం కోసం అవసరమైన మానవ వనరులు అందించేందుకు ఇలాంటి బాలోత్సవాలు ఎంతో అవసరమన్నారు. నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్, శ్రీ వెంకటేశ్వరా ఫైనాన్స్ అధినేత వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతను పెంచుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఎన్ఎస్ఎస్ శర్మ, ఎల్ఐసీ ఏవో ఆర్.రామ్మోహనరావు, కవి అరిపిరాల నారాయణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలను నాటడం ద్వారా సమాజాన్ని కాపాడుకోవడానికి దోహదపడాలని సూచించారు. గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి రెండు రోజుల పాటు జరిగిన వివిధ పోటీల్లో 5,600 మంది పాల్గొని తమ ప్రతిభ చాటారన్నారు. రెండో రోజున కూడా కల్చరల్, అకడమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. క్లాసికల్, జానపద నృత్యాలు, కోలాటం, మట్టితో బొమ్మల తయారీ వంటి పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజేతలకు మెడల్స్, మెమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని అమరావతి బాలోత్సవం నిర్వాహకులు టి.క్రాంతికుమార్, సంఘసేవకులు మాటూరి సిద్ధార్థ, భాస్కర్, డాక్టర్ చైతన్యశేఖర్, బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణకుమార్ పర్యవేక్షించారు.



బాలోత్సవం పోటీల్లో విజేతలకు మెమెంటో అందజేస్తున్న జితేంద్ర తదితరులు



బాలోత్సవంలో కోలాటం పోటీలకు హాజరైన బాలికలు

జైలు నుంచి ఇంటికి..

● ఐదేళ్ల తరువాత ఇంటికి చేరిన కోడి కత్తి శ్రీను

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11: కోడి కత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకి హైకోర్టులో బెయిల్ లభించడంతో ఆదివారం స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలోని తమ నివాస గృహానికి చేరుకున్నాడు. బెయిల్ రావడం చాలా ఆనందంగా ఉందని జనిపల్లి శ్రీనివాసరావు ఈసందర్భంగా పేర్కొన్నారు. జైల్లో తాను డిగ్రీ పూర్తి చేశానని, లా చదవాలనుకున్నాను. అయితే అందుబాటులో లేకపోవడంతో బీఏ డిగ్రీ పూర్తిచేసి ఎంఏ సోషియాలజీ చదువుతున్నాను. సమాజంలో మంచి కోసం పోరాటం చేసేందుకు సోషియాలజీని చదువుతున్నట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జైల్ సూపరింటెండెంట్ రాజారావు, జైలర్ కుమారస్వామి, అంబేడ్కర్ యూనివర్శిటీ లెక్చరర్ అనంతలక్ష్మిలు తాను చదవడానికి ఎంతో తోడ్పాటును ఇచ్చానన్నారు. ఖైదీల హక్కుల సంక్షేమ సంఘం, సమతా సైనిక్‌దళ్‌వారు పోరాటం, న్యాయవాది సలీమ్ కృషివల్ల తనకు బెయిల్ లభించిందన్నారు.



న్యాయవాది సలీమ్‌తో పోలీసుస్టేషన్‌కు హాజరవుతున్న శ్రీనివాసరావు

న్యాయవాది కృషి ఫలితమే : తల్లిదండ్రులు సావిత్రి, తాతారావు

కుమారుడు శ్రీనివాసరావు బెయిల్‌పై ఇంటికి రావడం చాలా ఆనందంగా ఉందని తండ్రి తాతారావు, తల్లి సావిత్రి పేర్కొన్నారు. శ్రీనివాసరావు జైల్లో ఉన్నప్పుడు తమ న్యాయవాది సలీమ్ ఎంతో ఆదరించి అండగా నిలబడ్డారన్నారు. విజయవాడలో నాలుగు ప్రజా సంఘాలు చేసిన పోరాటానికి న్యాయవాది కృషి ఫలితంగా కుమారుడికి బెయిల్ వచ్చిందని, లేకపోతే వచ్చి ఉండేది కాదన్నారు. న్యాయవాది సలీమ్, ప్రజా సంఘాలకు తమ కుటుంబం చాలా రుణపడి ఉంటామన్నారు.

బాహుబలి-2 ముందుంది : న్యాయవాది సలీమ్

ఈ కేసులో ఐదు సంవత్సరాలు ప్రయాణం చేశారు. శ్రీనివాసరావు కుటుంబంతో ఎంతో అనుబంధం ఏర్పడింది. శ్రీనివాసరావు తల్లి సావిత్రి నా సలీమ్ అని పలకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. వ్యవస్థ ఒక అమాయకుడి పట్ల ఎలా మిస్‌చీఫ్ చేసిందో ఈ కేసులో తెలిసింది. తెలుగుదేశం, వైసీపీల మధ్య రాజకీయాలు శ్రీనివాసరావును బలి పశువును చేశాయి. ఫలితంగా ఐదు సంవత్సరాల జీవిత కాలాన్ని ఒక దళిత యువకుడు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కేసులో బాధితుడు ముఖ్యమంత్రి కావడం వల్లనే దీనిపై కీలక ప్రభావం చూపించిందని, లేదంటే ఎప్పుడో బెయిల్ వచ్చేదన్నారు. కేసు కూడా తేలిపోయి ఉండేదని అభిప్రాయ పడ్డాడు. ఈ కేసు వాదించేందుకు న్యాయవాదులెవరూ ముందుకు రాలేదు. ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా తానే కేసును వాదించానని శ్రీనివాసరావు కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావిస్తున్నానన్నారు. శ్రీనివాసరావు 5వేల పుస్తకాలు జైల్లో చదివాడని, సమాజంలో మంచి కోసం పోరాటం చేస్తానని, అందుకు నా సహకారం కూడా కావాలన్నారు. ఈ కేసులో సీఎం జగన్ మనసులేని వ్యక్తిగా ప్రవర్తించారని, విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన జగన్ ఆయన వారసులైన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపట్ల మనసు లేకుండా ప్రవర్తించారన్నారు. సీఎం ఎన్‌వోసీ ఇచ్చినా, కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పినా ఇంత సమయం వృథా అయ్యేది కాదన్నారు. బాహుబలి-2లో కట్టప్పను బయటకు లాగుతాం. ఎవరి హస్తం ఉందో తేల్చి శ్రీనివాసరావుపైన పడిన మచ్చను కడిగేస్తామన్నారు.


లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం

● రూ.3.65లక్షల ఆదాయం



తుని రూరల్, ఫిబ్రవరి 11: లోవదేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామున అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవోవిశ్వనాథ రాజు ప్రత్యేక ఏర్పాట్లుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులతో వివిధ విభాగాల ద్వారా రూ.3.65లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

విషాద యాత్ర



విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు

● సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి
● రంపయర్రంపాలెంలో విషాదఛాయలు



మృతులు కాకర వీరవెంకటఅర్జున్, అండిబోయిన దేవిచరణ్, లావేటి రామన్‌జీ



సీతపల్లివాగులో గల్లంతైన విద్యార్థుల మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యం

గోకవరం, ఫిబ్రవరి 11: విహారయాత్ర విషాదంగా మారింది. రాజమహేంద్రవరం-భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లాలో రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. కన్నవారికి తీవ్ర శోకాన్ని మిగిల్చారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన కాకర వీరవెంకటఅర్జున్(15), అండిబోయిన దేవిచరణ్(15), లావేటి రామన్‌జీ(15), తోపాటు మరో ఇద్దరు విద్యార్థులు రంపయర్రంపాలెంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఈ ఐదుగురు రెండు మోటారు సైకిళ్లపై విహారయాత్రకంటూ ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద కాసేపు సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. 3-4గంటల మధ్య అర్జున్, దేవిచరణ్, రామన్‌జీ స్నానం చేసేందుకు వాగులోకి దిగారు. కొద్దిసేపటికి వారి జాడ కనిపించకపోవడంతో గట్టున ఉన్న ఇద్దరు గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న రంపయర్రంపాలేనికి చెందిన మరికొందరు పర్యాటకులు విషయం తెలుసుకొని వారికోసం వెతకడం ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఈతగాళ్లు వాగులోకి దిగి గాలించగా ముగ్గురి మృతదేహాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● గ్రామంలో విషాద ఛాయలు: విహారయాత్రకు వెళ్లిన ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సీతపల్లివాగులో పడి మృతి చెందడంతో రంపయర్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మధ్యాహ్నం వరకు కళ్లముందే కలియదిరిగిన ముగ్గురు విద్యార్థులు వాగులో పడి మృతి చెందారన్న విషాదవార్తను గ్రామస్థులను కలిచివేసింది. గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. గ్రామస్థుల్లో చాలామంది విద్యార్థుల మృతదేహాలను చూసేందుకు రంపచోడవరం ప్రభుత్వాసుపత్రి వద్దకు వెళ్లారు.

● తీవ్ర శోకాన్ని మిగిల్చారు: మనం తిన్నా తినకపోయిన పదో తరగతి వరకు చదివించాం. ఇంకో రెండు, మూడేళ్లు ఏదో రకంగా కష్టపడి చదివిస్తే మనకు అండగా ఉంటారనుకున్నామని, ఇంతలోనే తమ ఆశలపై నీళ్లు చల్లి తీవ్ర శోకాన్ని మిగిల్చారంటూ మృతుల తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. కాగా అర్జున్ తండ్రి కాకార విష్ణు రేషన్‌షాపు డీలర్. దానిపైన వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ జరుగుతోంది. దేవిచరణ్ తండ్రి అండుబోయిన అప్పారావు వ్యవసాయ కూలి. ఏపూటకాపూట కూలిపనికి వెళ్తేనే గాని జీవనం సాగదు. రామన్‌జీ తండ్రి సత్తిబాబు కూడా వ్యవసాయ కూలీనే. ఇతను కూడా పనికి వెళ్తేనే ఆ కుటుంబంలోని అందరు కడుపులు నిండుతాయి.

(రంపచోడవరం)

అల్లూరి జిల్లాలో పలు విహార కేంద్రాలు మృత్యుకుహారాలుగా మారి పలు కుటుంబాలలో విషాదాన్ని మిగుల్చుతున్నాయి. ముఖ్యంగా పాపికొండలు, కొండ వాగులు, జలపాతాలు, ప్రమాదకరమైన గిరి ప్రాంతాలు ఇలా మన్యం నలుమూలలగా విస్తరించిన విహార క్షేత్రాలలో ఎక్కడా కూడా సరైన రక్షణ చర్యలు లేకపోవడమే ప్రమాదాలకు మూలమవుతోంది. కొండవాగులలో చోటు చేసుకుంటున్న ఇసుక అక్రమ తవ్వకం వంటి మానవ తప్పిదాలు కూడా ఆయా కేంద్రాలను ప్రాణాపాయ కేంద్రాలుగా మార్చేశాయి. ఆదివారం భద్రాచలం హైవేపై అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపాన ఉన్న సీతపల్లి వాగు పర్యాటక కేంద్రంలో చోటు చేసుకున్న ముగ్గురు విద్యార్థులను బలితీసుకున్న ప్రమాద ఘటన ఇందుకు అద్దం పడుతోంది. గత నెలలో ఇదే ప్రాంతంలో ఇద్దరు సీతపల్లి వాగులో దిగి మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటనా ప్రాంతాన్ని, దాని పరిసరాలను పరిశీలిస్తే అక్కడ చోటుచేసుకున్న అనేక మానవ తప్పిదాలు, ఇవి తెలిసీ కూడా వాటిని నిరోధించాల్సిన వ్యవస్థల నిర్లక్ష్యం తరచు ప్రమాదాలకు కారణమవుతోంది. ఇక్కడ వాగును అక్రమంగా ఇసుక త్రవ్వకాల కోసం వాడుకోవడం, వాగు ప్రాంతం ఇసుక త్రవ్వకాలతో లోతుగా ప్రమాదకరంగా మారడం, ఇది తెలియని పర్యాటకులు వాగులో దిగి మృత్యువాత పడటం ప్రహసనంగా మారింది. ఈ పర్యాటక కేంద్రంలో ప్రభుత్వపరంగా సరైన రక్షణ చర్యలు కానీ, వాగు వద్ద పర్యాటకులను వారించే వ్యవస్థలు, వ్యక్తులూ లేకపోవడంతో పర్యాటకుల విచ్చలవిడి విహారానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఈ వాగు ఇప్పటికే ఎన్నో ప్రాణాలను బలితీసుకున్నా, ఈ విషయాలను తెలిసి కూడా అక్కడ రక్షణ కంచెలను ఏర్పాటుచేసి పర్యాటకులను వాగులోకి దిగకుండా నిరోధించలేని నిర్లక్ష్యాలే ఈ ప్రమాదాలకు కారణమయ్యాయి.

ఊపిరి తీస్తున్న విహారం..

● విహార కేంద్రాల్లో లోపించిన రక్షణ చర్యలు
● పట్టించుకోని అధికార యంత్రాంగం
● చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

ఈ ఒక్క ప్రాంతమే కాదు మన్యం నలుమూలలుగా మోతుగూడెం, డొంకరాయి, పాపికొండలు, మారేడుమిల్లి, అడ్డతీగల, వైరామవరం తదితర మండలాలల్లో ఉండే ప్రమాదకర జలపాతాలూ, ఎత్తైన ప్రమాదకర కొండలు, గుడిసె క్షేత్రం వంటి ప్రాంతాలలో పోలీసు, రెవెన్యూ, అటవీశాఖలు పూర్తిగా విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో పాపికొండలు ప్రాంతంలో చోటుచేసుకున్న బోటు ప్రమాదం ఎన్నో కుటుంబాలలో విషాదాన్ని నింపిన అనంతరం పాపికొండల విహారానికి ఎన్నో ఆంక్షలతో ప్రమాదాలు నిలువరించబడ్డాయి. కానీ ఇతర ప్రాంతాల విషయంలో కూడా ఈ ప్రమాదాలను ముందస్తుగా నిరోధించగల సత్తా ఉన్నా, ఆయా శాఖలు, అధికారులు పరోక్షంగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంస్థలకు, వ్యక్తులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుండటంతో ఆయా అధికారులు సైతం తప్పనిసరి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. మన్యంలో కేంద్ర సర్వీసులకు చెందిన ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే ఆయా శాఖలు పనిచేస్తున్నా ఇటువంటి ప్రమాదాలను నిరోధించే చర్యలను తీసుకోవడంలో వారిని నిరోధించే వ్యవస్థలదే పైచేయి కావడంతో అంతటి కేంద్ర సర్వీసుల ఉన్నతాధికారులు సైతం చోద్యమే చూస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం కేవలం ఆదాయమే ఆపేక్షగా కాకుండా కట్టుదిట్టమైన రక్షణ, భద్రతా చర్యలను చేపడితే ప్రమాదరహిత విహారం మన్యంలో శోభిల్లుతోంది.

సరదా కోసం వెళ్లి తిరిగి రాని లోకాలకు..

● యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డు ప్రమాదం
● ఇద్దరు యువకుల మృతి



యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డుప్రమాదంలో మృతి చెందిన జానీ, ప్రసాద్

కె.గంగవరం/అనపర్తి, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని యర్రపోతవరం లాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పామర్రు ఎస్.ఐ. జానీ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం అనపర్తి సావరంకు చెందిన దుర్గాడ జానీ(26), లక్ష్మీనరసాపురంకు చెందిన పిల్లి ప్రసాద్(28)లు మరో ఇద్దరు స్నేహితులతో కలసి ఆదివారం ఉదయం యానాం వెళ్ళారు. అక్కడ పని ముగించుకుని తిరిగి యానాం నుంచి అనపర్తి వెళుతున్న సందర్భంలో యర్రపోతవరం లాకుల వద్ద ఎదురుగా వస్తున్న లారీని డీ కొట్టారు. ఈ ప్రమాదంలో జానీ, ప్రసాద్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సి.ఐ. పి.దొరరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మరణించిన ప్రసాద్, జానీ మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు చెప్పారు. ప్రసాద్, జానీ మరణంతో రెండు కుటుంబాలు వారు కుటుంబ పెద్దలను కోల్పోయారు. వీరిలో జానీకి చదువుకుంటున్న తమ్ముడు, ప్రసాద్‌కు పెళ్లీడుకు వచ్చిన చెల్లెలు ఉన్నారు. వీరి మరణంతో అనపర్తి సావరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

రెండు కుటుంబాల్లో విషాదం

ఆదివారం పనికి సెలవు కావడంతో స్నేహితులు సరదాగా గడిపేందుకు యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పాయారు. చేతికందిన కొడుకులు ప్రాణాలు కోల్పోవడంతో రెండు కుటుంబాలలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. అనపర్తి మండలం లక్ష్మీనరసాపురానికి చెందిన పిల్లి ప్రసాద్(26), అనపర్తి సావరంనకు చెందిన దుర్గాడ జానీ(28) స్నేహితులు. ఇద్దరూ అవివాహితులే.. తాపీ పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇద్దరికీ తండ్రులు లేకపోవడంతో రెండు కుటుంబాలకు వారే ఆధారం కావడంతో రెండు కుటుంబాల వారు అనాథలుగా మిగిలారు. ఆదివారం తాపీ పనికి సెలవు కావడంతో ఇద్దరూ మోటారుసైకిల్‌పై యానాం వెళ్లి సరదాగా గడిపారు. తిరుగు ప్రయాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులవద్దకు చేరుకునే మోటార్‌సైకిల్.. లారీని ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. భర్తలు లేరు.. కడవరకు తమను చూసుకుంటారని గంపెడు ఆశలు పెట్టుకున్న ఆ తల్లులు.. కుమారులు అర్థాంతరంగా తమను విడిచి వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు యువకుల మృతితో రెండు గ్రామా ల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

సత్యదేవుడి సన్నిధిలో

ప్రారంభమైన మాఘమాసపు రద్దీ

● రూ.40 లక్షల ఆదాయం



అన్నవరం, ఫిబ్రవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మాఘమాసపు రద్దీ ప్రారంభమైంది. గతనెల రోజులుగా పుష్యమాసం శూన్యమాసం కావడంతో శుభకార్యక్రమాలు లేక అలయంలో సాధారణ రద్దీ మాత్రమే ఉండేది. వివాహాలు సీజన్ ప్రారంభంకావడం ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి విచ్చేశారు. భక్తులు అధికసమయం వేచి ఉంచకుండా ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలతో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అంత్రాలయ ప్రదక్షణ దర్శనం టిక్కెట్లను కొద్దిసేపు నిలుపుదల చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

సూర్యభగవానుడికి ప్రత్యేకపూజలు

మాఘపు ఆదివారం పురస్కరించుకుని కళామందిరంలో రుత్విక్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు సూర్యనమస్కారములు కార్యక్రమం నిర్వహించారు. వివిధ ఆసనాలతో ఆరోగ్యప్రదాత అయిన సూర్యభగవానుడిని ఆవాహన చేయించి క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 11 : ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు. మాఘ మాసోత్సవాల్లో భాగంగా తిరునాళ్లను పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. మాఘమాసంలో వచ్చిన తొలి ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలాచరించారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేషు భావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి భక్తితో స్వామి వారికి పాలపొంగులు, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను నివేదిస్తూ ఆకాశంలోకి ఎగురవేశారు. వీటిని భక్తులు కొంగులతో ఒడిసిపట్టుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జగన్ మళ్లీ వస్తే బతకలేం



సింహగర్జన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

● దళితులను ఇంత నీచంగా చూసిన ముఖ్యమంత్రిని చూడలేదు ● దగా పడ్డ దళితుల ఆత్మగౌరవ పోరాటమే సింహగర్జన ● బీసీలకు తగ్గకుండా కాపుల రిజర్వేషన్లుకు మద్దతిస్తాం ● అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ● వేమగిరిలో దళిత సింహ గర్జన సభ

రాజమహేంద్రవరం సిటీ/కడియం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళితులు దగా పడ్డారని, వారి ఆత్మగౌరవ పోరాటమే ఈ సింహగర్జన సభ అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలో వేమగిరి జాతీయ రహదారి వద్ద మైదానంలో ఆదివారం సాయంత్రం జగన్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తూ ఆయన దళిత సింహగర్జన సభను నిర్వహించారు. విజయనగరం నుంచి అనంతపురం వరకు, ఆంధ్రాతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి దళితులు హాజరయ్యారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవనరామ్‌లకు నివాళులర్పించారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ పోరాడితే పోయేది లేదు.. బానిస సంకెళ్లు తప్ప అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం జగన్ దళితులను నమ్మించారని, క్రైస్తవులు నమ్మి జగన్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అయితే మణిపూర్‌లో క్రైస్తవులపై మారణ కాండ సృష్టిస్తే ఈ సీఎం కనీసం స్పందించలేదని, పైగా ఆనాడు అవిశ్వాసం పెడితే కేంద్ర ప్రభుత్వానికి ఈ వైసీపీ ఎంపీలు ఓటు వేశారని గుర్తు చేసారు. దేశంలో దళితులను ఇంత నీచంగా చూసిన జగన్ లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో బక్కి శ్రీను మొదలు డ్రైవరు సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, గుంటూరులో రమ్య, అనంతపురంలో స్నేహలత, పులివెందులలో నాగమ్మ, కడపలో డాక్టర్, దొమ్మేరులో మహేంద్ర, నడింపల్లి రాము హత్యాకాండలు.. అలానే మైనింగ్‌ను ప్రశ్నించిన వరప్రసాద్ శిరోముండనం సంఘటన ఇలా చెపుతూ పోతే చాలా మంది దళితులు బలయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారని, దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారని, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు లేకుండా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దళితులకు దక్కాల్సిన రూ.75 లక్షల కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాత్ర సినిమా చేసిన దర్శకునికి రెండెకరాల భూమి ఇచ్చిన ఈ ప్రభుత్వం బాధిత దళితులకు భూమిని కేటాయించలేకపోయిందని విమర్శించారు. అమ్మఒడి పథకానికి సబ్‌ప్లాన్ నిధులను ఖర్చుచేశారన్నారు. బేస్ ఎవలైబుల్ స్కీంను రద్దు చేసిందని, ఇంత మంచి స్కీంను తీసివేయడంపై సుప్రీంకోర్టు స్పందించి పునరుద్ధరించాలని చెప్పిందన్నారు. కులాంతర వివాహం స్కీంను జగన్ రద్దు చేశాడని గుర్తుచెశారు. ఎన్ఎస్‌సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గతంలో కార్లు ఇచ్చేవారని అది లేదని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. లక్ష సబ్సిడీ వచ్చేదని అదీ రద్దు చేశాడని ధ్వజమెత్తారు. దళితులను దగా చేసిన ఈ ముఖ్యమంత్రి మళ్లీ వస్తే దళితులు బతకలేరని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులంతా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తే తీసుకోండి.. ఎందుకంటే అది ఇసుక, మద్యం, కొండలు దోచేసిన డబ్బే కదా... కాని జగన్‌కు ఓటు వేయొద్దన్నారు. జగన్‌ను దించే వరకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలో బీసీలకు తగ్గించకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. తొలుత ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేత జార్జి సీమంతుల మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని హర్షకుమార్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నామన్నారు. జగన్.. పాస్టర్లకు గౌరవ వేతనం అంటూ 29 వేల మందిని గుర్తించి కేవలం 8 వేల మందిని ఎంపిక చేశారన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ అని పెట్టి చర్చిలు కడతామని మాట ఇచ్చి ఒమ్ము చేశారన్నారు. జంగా బాబూరావు మాట్లాడుతూ దళితులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, అభివృద్ధి కుంటుపడిందన్నారు. దళిత సత్తా అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ దళిత సైన్యం సిద్ధంగా ఉందని, జగన్ అంతం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు బక్కి శ్రీను భార్య, నడింపల్లి గంగమ్మ తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. జీవీ శ్రీరాజ్ మాట్లాడుతూ దళిత సింహగర్జన సభలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై అమరావతిలో ఓ సమావేశం పెడతామని అటుపై గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. ఈ సభలో ఏలూరు మాలమహాసేన అధ్యక్షుడు రవికుమార్, బొజ్జా ఐశ్వర్య, నడింపల్లి గంగమ్మ, అయితాబత్తుల సుభాషిణి మాట్లాడారు. సభలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన దళిత నాయకులు చిట్టిరాజు, హైదరబాదు గుడిమెళ్ల వినోద్, కప్పల వెలుగు, శ్యాంబాబు, సింగపల్లి రమేష్, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి విజయ్‌కుమార్, గెడ్డం వెంకట్రాజు, ఇసుకపట్ల వెంకటరమణ, గెడ్డం శ్రీను, కరుణాకర్, శ్యాంసుందర్, విజయనగరం ఆదాల మోహన్, నిడదవోలు బండి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.



తొండంగి నుంచి వచ్చి మాట్లాడుతున్న బాధితురాలు గంగ

కాలపరీక్షకు అందరూ నిలబడాల్సిందే

● ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న డాక్టర్ ఉమర్‌ఆలీషా, నన్నయ్య వీసీ పద్మరాజు

పిఠాపురం, ఫిబ్రవరి 11: కాలపరీక్షకు అందరూ నిలబడాల్సిందేనని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని నూతన ఆశ్రమ ప్రాంగణంలో మూడురోజులుగా జరుగుతున్న పీఠం వార్షిక మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణచేస్తూ మానవుడు తన జీవన పయనంలో ఎదురయ్యే కష్టనష్టాలు, దుఃఖాలు, తదితర కాలపరీక్షలను ఎదుర్కోవాలంటే ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కాలానికి అతీతంగా ప్రయాణించే జీవి ఏదీ సృష్టిలో లేదని చెప్పారు. తాత్వికులు, యోగులు అందరూ కాలగమనంతో ప్రయాణం చేసేవారేనని తెలిపారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కె.పద్మరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మిక తత్వప్రబోధం, సామాజిక సేవల ద్వారా విశ్వమానవ శ్రేయస్సు కోసం పీఠం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గురువు ద్వారా పొందిన తాత్విక జ్ఞానాన్ని మరింతమందికి పంచాలని సూచించారు. అనంతరం ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. పీఠం ప్రచురించిన కరదీపికలు, గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, అహ్మద్ ఆలీషా, సాహితీవేత్త జానకిరామచౌదరి, కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బుజ్జి, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ పాల్గొన్నారు.

ఆకతాయిపై కేసు నమోదు

● బీరులో కల్తీ జరిగిందని వాదన
● ల్యాబ్ పరీక్షలో అతడే సిరా కలిపాడని నిర్ధారణ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11: బీరు సీసాలో ఇంకు కలిపి పలువురు అధికారులను ఇబ్బంది పెట్టిన ఓ ఆకతాయిపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఏటిమొగకు చెందిన పట్టా వెంకటేశ్వర్లు ఈనెల 5న తన కుమారుడిని కాకినాడ జె.రామారావుపేటలోని బ్రాందీషాపునకు పంపి పాస్టర్స్ కంపెనీకి చెందిన రెండు బీర్‌లను రప్పించుకున్నాడు. అనంతరం ఒక బీర్ తాగాడు. మరో బీర్ మూత తీసేసరికి అది నీలం రంగులో ఉందని, అదేరోజు రాత్రి బ్రాందీ షాపునకు వెళ్లి అక్కడ సిబ్బందితో వాదనకు దిగాడు. దీంతో సిబ్బంది అధికారులకు తెలియజేయడంతో అసిస్టెంట్ రిటైల్ అవుట్ లెట్ మోనిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి బృందం ఆ బీరు బాటిల్‌లోని ద్రవం నమూనాను ఆ బ్యాచ్‌కు మిగతా బీరుల నమూనాలను సేకరించి గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబొరేటరీకి పంపారు. శనివారం వచ్చిన ల్యాబ్ నివేదికలో బీరులో కల్తీ జరగలేదని, వెంకటేశ్వర్లు కావాలని బీరులో సిరా కలిపి అధికారులను ఇబ్బంది పెట్టినట్లు నిర్ధారణకు వచ్చారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు కేసు నమోదు చేశారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

తడిక వాగు వద్ద పర్యాటకుల సందడి



తడిక వాగు జలపాతాల్లో సందడి చేస్తున్న పర్యాటకులు

మోతుగూడెం, ఫిబ్రవరి 11: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న మల్లవరం గ్రామంలో లోపల తడికవాగు జలపాతం పర్యాటకులతో సందడిగా మారింది. ఆదివారం కావడంతో పర్యాటకులతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. పట్టణాల్లో తీరకలేని జీవితంతో సతమతమవుతున్న వారు వారాంతపు సెలవులు కావడంతో మోతుగూడెం పరిధిలోని తడికి వాగు ప్రాంతంలో ఉన్న సెలయేటిలో ఎంతో సంతోషంగా కేరింతలు కొట్టారు. ఈ ప్రకృతి వాతావరణం వారికి ఎంతో సంతోషాన్ని ఆనందాన్ని ఇచ్చిందని ఇలా గడపడం వారికి చాలా ఆనందంగా ఉందని పర్యాటకులు చెబుతున్నారు.

మధ్యాహ్న బియ్యం అవకతవకలపై విచారణ జరపాలి

కూనవరం, ఫిబ్రవరి 11: కూనవరం మండలంలో పాఠశాలలకు పంపిణీ చేసే మధ్యాహ్న బియ్యం అవకతవకలపై విచారణ జరపాలని కూనవరం సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. ఉపాధ్యాయుల నుంచి వేలిముద్రలు తీసుకుని బియ్యం మాత్రం సరఫరా చేయకుండా ఆ బియ్యాన్ని పక్కదారి పట్టించారన్నారు. ఈ బియ్యంపై ఉపాధ్యాయులు నేరుగా ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. జీసీసీ సిబ్బందిపైన తక్షణమే విచారణ జరిపించాలన్నారు. రేషన్‌షాపులకు సైతం సక్రమంగా నిత్యావసర వస్తువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మధ్యాహ్నభోజన పథకం అవకతవకలపై జిల్లాకలెక్టర్, ఐటీడీఏ పీవో విచారణ జరపాలన్నారు.

పౌష్ఠికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చు

• మన్యంలో వేద స్పైన్ సెంటర్ వైద్యుల సలహాలు



రంపచోడవరంలో నిర్వహించిన వేద స్పైన్ సెంటర్ వైద్య శిబిరం

రంపచోడవరం, ఫిబ్రవరి 11:పౌష్ఠికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చునని వైద స్పైన్ సెంటర్ మన్యం వాసుల్లో చైతన్యాన్ని తీసుకువస్తోంది. ఆదివారం రంపచోడవరం పంచాయతీలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పలువురు వైద్యులు ఈ శిబిరంలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా మన్యంలో మహిళల్లో రక్తహీనత సమస్య కారణంగా మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని పౌష్ఠికాహారం తీసుకోవడంద్వారా అధిగమించవచ్చునని అన్నారు. వైద్యురాలు లక్ష్మీ మృదుల బృందం అయా మహిళలకు, గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను తీసుకోవాలని సూచించారు. వెన్నెముక వైద్యులు తేజో ఫణీంద్ర మాట్లాడుతూ టీబీ వ్యాధి కూడా పౌష్ఠికాహార లోపంతోనే ఎదురవుతోందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య రోగులకు మందులను పంపిణీ చేశారు.

పల్లె పల్లెకు పోదాం పదండి : బీజేపీ



కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎటపాక, ఫిబ్రవరి 11 : గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎటపాక మండలం, నెల్లిపాక గ్రామంలో పల్లె పల్లెకు పోదాం పదండి కార్యక్రమంను నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.పెరమయ్య ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన క్యాలెండర్ ఆవిష్కరించి, పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతా దుర్గారావు, నలజాల శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.

పాపికొండలకు ఆరు బోట్లు

దేవీపట్నం, ఫిబ్రవరి11: ఆదివారం పాపికొండలు విహారయాత్రకు ఆరు బోట్లలో సుమారు 400 మంది పర్యాటకులు వెళ్లారు. పోశమ్మగండి నుంచి పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండ మొదలు, గోదావరి పరీవాహక ప్రాంతాల మీదుగా పాపికొండలు వెళ్లాయి.

ఏరులై పారుతున్న నాటుసారా

• అటవీ ప్రాంతాలే కేంద్రంగా సారా బట్టీలు..



రాజవొమ్మంగి ఫిబ్రవరి 11: మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో నాటుసారా ఏరులై పారుతోంది. కొందరూ అటవీప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న నాటుసారా బట్టీలు కుటీర పరిశ్రమలను తలపిస్తున్నాయి. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా సారా వ్యాపారం మాత్రం జోరుగా సాగుతోంది. గిరిజన గ్రామాల్లో ఫిల్టర్ వాటర్ దొరకకపోవచ్చేమో కానీ సారాకి మాత్రం కొదవలేదు అంటూ మహిళలు వాపోతున్నారు. కొందరు సారా వ్యాపారం చేస్తున్నారని పోలీసులు కేసులు నమోదు చేసినా, నాటుసారా విక్రయాలే వారికి ప్రధాన ఆదాయ వనరుగా మార్చకోవడంతో వారు ఈ వ్యాపారం వదలలేకపోతున్నారు.

చాలా ప్రమాదకరం

సారా తయారీలో ప్రమాదకరమైన వస్తువులను వినియోగిస్తారు. నల్లబెల్లం, కుళ్లినపండ్లు, యూరియా, స్పటిక వంటి తదితర పదార్థాలను కలిపి సుమారు 15రోజుల పాటు భూమిలో పాతిపెట్టి, తరువాత పొయ్యిమీద కాపు సారా కాస్తారు. కొన్ని సందర్భాల్లో సారాలో ఆల్కాహాల్ శాతం పెరిగి మత్తు రావటానికి స్పిరిట్‌ను, కొన్ని రకాలైన రసాయనాలను కలుపుతారు. అవి కల్తీగా మారి ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. ప్రమాదకర వస్తువులతో దీనిని తయారు చేయటంవల్ల తాగిన వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

అధిక మద్యం ధరలు, బ్రాండ్లు అందుబాటులో లేకా..?:

ప్రభుత్వ మద్యం షాపులలో మద్యం గతంలో కంటే అధికధరలకు దొరకడం, ప్రజలకు నచ్చిన (అలవాటైన) బ్రాండ్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తక్కువ ధరకు దొరికే నాటుసారాకు అలవాటు పడ్డారు. చాలా మంది మందుబాబులు అయితే నాటుసారాకు, ప్రభుత్వ మద్యానికి తేడా లేదంటున్నారు.

నామ మాత్రంగా కేసులు

గ్రామాల్లో సారా ఏరులై పారుతున్న సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది (2023 సంవత్సరంలో) మండలంలో ఎస్ఈబీ అధికారులు ఏడు కేసులు నమోదుచేసి కేవలం 21 లీటర్ల సారా మాత్రమే సీజ్ చేశారు. అలానే రాజవొమ్మంగి పోలీసుస్టేషన్‌లో 2022లో 10కేసులు, 2023లో 14కేసులు నమోదు చేయగా, జడ్డంగి పోలీసుస్టేషన్ పరిధిలో 2022లో 9, 2023లో 9కేసులు మాత్రమే నమోదు చేశారు. అధికారులు గ్రామా ల్లో నీటి కుళాయిల కోసం మహిళలతో సమావేశం నిర్వహించిన, డ్వాక్రా సంఘాలకు వెలుగు అధికారులు సమావేశాలు నిర్వహించిన మహిళలు మాట్లాడుతూ సారాని అరికట్టాలంటూ వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాజవొమ్మంగి మండలంలో సారాని అరికట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంకాలమ్మ జాతర మహోత్సవాలు

రాజానగరం, ఫిబ్రవరి 11: ప్రగడ వంశీయుల ఇలవేల్పు నరేంద్రపురంలో శ్రీఅంకాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాఘమాసంలో రెండేళ్లకోసారి ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారి మహిమలపై పంబనాధం కథను గానామృతం చేస్తారు. రాష్ట్రంలోని ప్రగడ వంశీయులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం ఆలయార్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రగడ రాంబాబు, ప్రగడ ఏకాశిబాబు, నాయకులు పంపన శ్రీనివాస్, ప్రగడ రామచంద్రరావు, ప్రగడ వీరబాబు, శివన్నారాయణ పాల్గొన్నారు.

జగన్‌ను మార్చేందుకు సిద్ధం

» టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి

» తెలుగు యువత కమిటీల ప్రమాణస్వీకారం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ అభ్యర్థులను మార్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌నే మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో ఆదివారం తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ అధ్యక్షతన తెలుగు యువత కమిటీల ప్రమాణస్వీకార సభ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలు నానా కష్టాలు పడ్డారని, మహిళలు, దళితులపై దాడులు అధికమయ్యాయని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సంపద సృష్టించేది టీడీపీ అయితే అలజడి సృష్టించేది వైసీపీ అని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జగన్ కొత్త డ్రామాలు ఆడుతున్నాడని దీనిని ప్రజలు గ్రహించాలన్నారు. టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. తప్పుడు ఆరోపణలు చేసి ప్రజాధనం లూటీ చేసేవారి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. గంజాయి, బ్లేడు బ్యాచ్‌లను తరిమేస్తామన్నారు. తొలుత నగరంలో భారీ బైక్ ర్యాలీ చేశారు. తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నక్కా దేవివరప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మునిని బాబూరావు, తెలుగు యువత పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా సింహ వెంకటేష్, చింతపల్లి నాని, అధికార ప్రతినిధి ఈతలపాటి రవి, కార్యనిర్వాహక కార్యదర్శులు వెల్లంకి జయరామ్, నరాల సూర్య, కార్యదర్శిగా దువ్వాపు సాయికిరణ్ తేజ్, నగర కమిటీ అధ్యక్షుడిగా లోకేశ్, ప్రధాన కార్యదర్శి పితాని పైడిరాజు, ఉపాధ్యక్షులుగా పింగళి వేణు, పందిరి యశ్వంత్, మోతా పండు, అధికార ప్రతినిధులుగా తాడేపల్లి ఫణీంద్ర, కెళ్ల శ్రీనివాస్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మొండ్రేటి గణేష్‌తోపాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులుగాను, ఏడుగురు కార్యదర్శులుగాను, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా తెరపల్లి సాయి దీపక్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సభలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణి, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధా, వైశ్రీను, మజ్జి రాంబాబు, యాళ్ల ప్రదీప్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న తెలుగు యువత కమిటీలు

టీడీపీలోకి ఆది యూత్

అనపర్తిలో వైసీపీకి భారీ షాక్

అనపర్తి, ఫిబ్రవరి 11: అనపర్తిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గత ఎన్నికలలో వైసీపీ విజయానికి రాత్రింబవళ్లు కష్టపడిన ఆది యూత్‌కు చెందిన సుమారు 1000 మంది తమ నాయకుడు మల్లిడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలోను, అలాగే దుప్పలపూడికి చెందిన వైసీపీ నాయకుడు నల్లమిల్లి వెంకటరెడ్డి(ఎస్‌వీ) తమ మిత్ర బృందం 150మందితో కలిసి ఆదివారం టీడీపీలో చేరారు. అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, మాజీ మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. జూలకంటి మాట్లాడుతూ వైసీపీ చేస్తున్న అక్రమాలు, అరాచకాలతో ప్రజలు విసుగు చెందారని ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చిందో ప్రజలకు అర్థమయిందని అన్నారు. నర్సిరెడ్డి ప్రసంగిస్తూ జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని నా బీసీలు, నా ఎస్సీలు, నా మైనారిటీలు అంటూ అందరికీ అన్యాయం చేశారన్నారు. రాజప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఖాళీ అవుతుందని ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రాజకీయ బదిలీలు చేస్తూ రాజకీయాల్లో కొత్త ఒరవడి తీసుకువచ్చిన జగన్ ఇంటి బాట పట్టడం ఖాయమన్నారు. బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ గెలిచే మొదటి సీటు అనపర్తి నియోజకవర్గమని దీనికి తిరుగులేదన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కార్యకర్తలను ఇబ్బందులు పెడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

భారీ బైక్ ర్యాలీ.. మల్లిడి కృష్ణారెడ్డి టీడీపీలోకి చేరుతున్న సందర్భంగా సుమారు వెయ్యికి పైగా బైకులతో గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనపర్తి సావరం నుంచి మొదలైన బైక్ ర్యాలీ పాతవూరు, మెయిన్‌రోడ్డు, కెనాల్‌రోడ్డు మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి దుప్పలపూడి చేరుకుని గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అలాగే టీడీపీలో చేరుతున్న ఆది యూత్ సభ్యులు ఇంతవరకు మోసిన వైసీపీ జెండాలను డస్ట్‌బిన్‌లో వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. బై బై వైసీపీ.. జై జై టీడీపీ అంటూ వైసీపీ కండువాలను డస్ట్‌బిన్‌లో వేయడం.. డస్ట్‌బిన్‌ను గంగలో కలపడం వినూత్నంగా జరిగింది.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులతో టీడీపీ రాష్ట్ర నేతలు

దుష్ట పాలనను అంతమొందించాలి: జ్యోతుల నెహ్రూ

గోకవరం, ఫిబ్రవరి11: రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ దుష్ట పాలనను అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెం సుమారు 120 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నాయకుడు ఉంగరాల రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నియంతగా వ్యవహరిస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనపై రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాబోతుందన్నారు. టీడీపీలో చేరిన వారిలో నరుకుల సత్యనారాయణ(నానిబాబు), కసిరెడ్డి రవిబాబు, మాదాసు నరసింహరావు, బోయిడ సూరబ్బు, కడవల వెంకరమణ, కోట బుజ్జి, నరుకుల సాంబశివ, గొల్లపూడి శ్రీనివాస్, గంధం స్వామి, రొక్కం దుర్గారావు, తదితరులున్నారు.



గోకవరం: రంపయర్రంపాలెంలో పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నెహ్రూ

కొమరిపాలెంలో దోసాలమ్మ జాతర

బిక్కవోలు, ఫిబ్రవరి 11: కొమరిపాలెం గ్రామ దేవత దోసాలమ్మ జాతర శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఎమ్మెల్యే, గూడూరి శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొవ్వూరి చినబుజ్జి, తాడి అరవిందం, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, కేవీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి, చింతా పాండురంగారెడ్డి, వెంకటరామారెడ్డి, సుబ్బిరామారెడ్డి పాల్గొన్నారు.

వేదికపై వైసీపీ నాయకుల చుట్టూ డాన్సర్ల చిందులు

అనపర్తి, ఫిబ్రవరి 11: కొమరిపాలెంలో శనివారం రాత్రి జరిగిన దోసాలమ్మ జాతర వైసీపీ జాతరలా మారింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లు వేదికపై ఆశీనులయ్యారు. సాధారణంగా కార్యక్రమ తిలకించాల్సిన పెద్దలు అదే వేదికపై ఆశీనులు కావడం, డాన్సర్లు వారి చుట్టూ డాన్స్ చేయడం, ఎమ్మెల్యేను భుజాలపై పెట్టుకుని డాన్సర్లు డాన్సులు వేయడం వంటి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



దోసాలమ్మను దర్శిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ జ్యోతిర్మయి

16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె

రాజానగరం, ఫిబ్రవరి 11: ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌లను జయప్రదం చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆదివారం సూర్యారావుపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రదర్శన, ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు మాట్లాడుతూ ఏఐకేఎంఎస్, కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా కిసాన్ మోర్చా వివిధ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు రైతాంగం, కార్మికులపై మోయలేని భారం మోపుతూ వారి హక్కులను కాలరాస్తున్నాయన్నారు. వీటిని ప్రతిఘటించేందుకు అంతా ఐక్యంగా పోరాడేందుకు ముందుకురావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు మరుకుర్తి వీరలక్ష్మి, నక్కా లక్ష్మి, దుర్గ, తోటకూర బేబీరాణి, గున్నూరు అరవాలమ్మ, తామర్ల గౌరి పాల్గొన్నారు.

తొస్సిపూడిలో ఇళ్ల పట్టాలు పంపిణీ

బిక్కవోలు, ఫిబ్రవరి 11: తొస్సిపూడి గ్రామంలో అర్హులైన 134 మందికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఇక్కడ పట్టాలు పంపిణీ జరగలేదన్నారు. కార్యక్రమంలో కొమరిపాలెం సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి చినబుజ్జి, నాయకులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, తేతలి జగ్గిరెడ్డి, రొంగల అప్పాజీ, విస్సాకోటి సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఏపీ ఆదర్శం

మంత్రి చెల్లుబోయిన వేణు



శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి వేణు

రాజానగరం, ఫిబ్రవరి 11: మహిళా సాధికారతకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. రాజానగరంలో ఆదివారం సాయంత్ర నిర్వహించిన ఆడపడుచుల ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో మహిళల అప్పులన్నీ తీరుస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని సీతానగరం రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేశామన్నారు. ఇంటింటికీ గోదావరి జలాలను సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీలు వరదు కళ్యాణి, పోతుల సునీత, వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాజమహేంద్రవరం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : పద్మశ్రీ ఘంటసాల 50వ వర్థంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు. గోదావరి బాలోత్సవం వేడుకల ప్రాంగణంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ రాకా ఆధ్వర్యంలో ఆది వారం ఘంటసాల చిత్రపటం ఎదుట అంజలిఘటించారు. పలువురు ఘంటసాల పాడిన పాటలను ఆలపించి అలరించారు. కార్యక్రమంలో రాకా కార్యదర్శి జీవీ రమణ, గాయకు భమిడిపాటి రామకృష్ణమూర్తి, ఎం.పార్వతి, గంగాభవానీ, గోభేరి శ్రీనివాస్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కడియం: మండలంలోని వేమగిరిలో ఘంటసాల అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తూరి బాలనాగేశ్వరరావు, బొర్రా సుబ్బారావు, సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పాలసీలపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన బాలోత్సవం సందర్భంగా ఎల్ఐసీ పాలసీలపై అవగాహన కల్పించడం జరిగిందని ఎల్ఐసీ మెయిన్ బ్రాంచి సీనియర్ బీఎం ఎన్ఎస్ఎస్ శర్మ తెలిపారు. ముగింపు సభలో ఎల్ఐసీ తరపున పోటీల న్యాయనిర్ణేతలను మెమెంటోలతో సత్కరించామన్నారు. రెండురోజుల ప్రచార కార్యక్రమంలో ఎల్ఐసీ రూరల్ బ్రాంచి మేనేజర్ సూర్యనారాయణ, ఏబీఎం వినోద్ కుమార్, మెయిన్‌బ్రాంచి ఏబీఎం శ్రీకాంత్, డివిజనల్ అధికారి రామ్మోహన్, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి- కొవ్వూరు రైల్వే ట్రాక్ సమీపంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ విజయ్ శంకర్ తెలిపారు. మృతుడు ఖాకీ రంగు టీషర్టు, షార్టు ధరించి ఉన్నాడన్నారు.అతడి వివరాలు తెలిసిన వారు 0883- 2442821,9491003239 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఎన్‌సీసీ మహిళా కేడెట్లు ఉత్తమ ప్రతిభ



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ మహిళా కేడెట్లు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. న్యూ ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే శిబిరంలో కళాశాలకు చెందిన బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని సౌమ్య పాల్గొని గార్డ్ ఆఫ్ ఆనర్‌కు ఎంపికైందన్నారు. శిబిరానికి విచ్చేసిన ఉపరాష్ట్రపతి, త్రివిధ దళాల అధిపతులు, ప్రధానమంత్రి వంటి వారికి రైఫిల్ సెల్యూట్ చేసే అంశంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎన్‌సీసీ డీజీ మెడల్ అందుకుందని తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థిని సీహెచ్ నిరీష రాష్ట్రస్థాయిలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు, ఇతర అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

రంగంపేట, ఫిబ్రవరి 11: మండలంలో నల్లమిల్లిలో అగ్ని ప్రమాదం జరిగి నిరాశ్రయులైన సమ్మంగి వరలక్ష్మీ కుటుంబానికి గ్రామస్థులు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన నల్లా శ్రీనివాస్, నెల్లి నాగరాజు, టైలర్, కేతా చంద్రయ్య, కొండేపూడి వెంకటరత్నం తదితరుల ప్రోద్బలంతో గ్రామస్థులు అందించిన సాయం మొత్తం రూ.లక్ష ఆదివారం వరలక్ష్మీకి అందించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపింది.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

అనపర్తి ఫిబ్రవరి 11: అనపర్తిలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ శిఖరానికి ప్రధాన శిఖరంతో బాటు మరో 12 ఉప కలశ శిఖరాలను దాతలు అందించారు. గ్రామానికి చెందిన పోతంశెట్టి గంగిరెడ్డి, జ్యోతి, జీవీఎల్ నారాయణరెడ్డి, మంజుభార్గవి, ఓగిరెడ్డి సత్తిరెడ్డి, మాధవి, కోనాల శ్రీధర్‌రెడ్డి విజయలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, గోపూజ చేశారు. స్వామి వారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుదాం

కడియం, ఫిబ్రవరి 11: మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం.. మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడదామనే అనే అంశంతో జమాతే ఇస్లామీ హింద్ ఈనెల 8 నుంచి 18 వరకు పలు కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేస్తోందని కడియం శాఖ కన్వీనర్ ఎండీ దాదాషరీఫ్ తెలిపారు. వారు నిర్వహించే కార్యక్రమాలను ఆదివారం కడియం మస్‌జిద్‌లో వివరించారు. యువత మద్యపానానికి అలవాటుపడి వారి జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలతో కలిగే నష్టాల పట్ల అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మస్‌జిద్ కౌసర్ షేక్ సలీం, బాషా, రహీం, గౌస్, ఇమాంజుభైర్ పాల్గొన్నారు.

గాదరాడలో మహాచండీ హోమం

కోరుకొండ, ఫిబ్రవరి 11: మన రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆదివారం మండలంలోని గాదరాడలో లక్ష్మీగణపతి రుద్ర సహిత మహాచండీ హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈ యాగానికి జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి చండీమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహా అన్నదానం నిర్వహించారు. మహిళలకు రవికల వస్త్రం, పండ్లు, తాంబూలం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రొంగల శ్రీనివాస్, మింగి లక్ష్మీనారాయణ, తోటకూర సత్యనారాయణ, మాతా ప్రభు, ఉంద్రు గాంధీ, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, దేవన దుర్గాప్రసాద్, మారిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

కోరుకొండ, ఫిబ్రవరి 11: రానున్న రోజుల్లో రాజానగరం నియోజకవర్గంలో ఆస్ట్రేలియా కంపెనీ ప్రతినిధుల సహకారంతో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. గాదరాడలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ఐటీ బృందం ఆయనతో భేటీ అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజానగరం, పిఠాపురం, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం నియోజకవర్గాల్లో సుమారు రూ.500 కోట్లతో ఐటీ కంపెనీలు ఏర్పాటు నెలకొల్పి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. కాగా కంపెనీలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు జనసేన-టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేస్తామని బలరామకృష్ణ చెప్పారు. సమావేశంలో పలువురు జనసేన, టీడీపీ నాయకులు, ఆస్ట్రేలియా ఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జంబుపట్నంలో శివాలయం ప్రారంభం

కోరుకొండ, ఫిబ్రవరి 11: మండలంలోని జంబుపట్నంలో నూతనంగా నిర్మించిన ఉమా సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 12వ తేదీ నుంచి 3రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. సోమవారం గణపతి పూజ, పరిషత్, గో పూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన అంకురార్పణ, మండపారాధనలు, అగ్నిమదన హోమాలు, 13న ప్రత్యేక హోమాలు, రుద్రాభిషేకం, విగ్రహాలకు ధాన్యధివాసం 14న యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠలు, పూర్ణాహుతి, కళాన్యాసం, గోదర్శనం, సర్వదర్శనం, అనంతరం అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది.

నయనాల నిస్వార్థ సేవకు గుర్తింపు డాక్టరేట్

సత్కార సభలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 11: నాలుగు దశాబ్దాలుగా నయనాల కృష్ణారావు నిస్వార్థంగా సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగానే డాక్టరేట్ ప్రధానం చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం మోరంపూడి ఏపీఎస్పీబీ కల్యాణ మండపంలో ఆదివారం గుబ్బల రాంబాబు అధ్యక్షతన జరిగిన నయనాల ఆత్మీయ సత్కార సభకు ఎంపీ భరత్‌రామ్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు హాజరయ్యారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ పూలే అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి బహుజనుల్లో చైతన్యం నింపి విద్య, సామాజిక రాజకీయ రంగాల్లో రాణించడానికి వారిని ప్రోత్సహించిన నయనాల ఆదర్శప్రాయులన్నారు. నయనాలను సత్కరించడానికి ముందుకు వచ్చిన ఆహ్వాన కమిటి చైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మిత్రబృందాన్ని అభినందించారు. అనంతరం కృష్ణారావును మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఏపీఎస్ఈబీ ఎస్ఈ కె.తిలక్ కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్, వైసీపీ నగర అధ్యక్షుడు అడబాల శ్రీహరి, తుమ్మిడి అరుణ్ కుమార్, రాయుడు శ్రీను, మొకమాటి సత్యనారాయణ, సంజీవరావు తదితరులు ఘనంగా సత్కరించారు.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024 | 5

నిడదవోలులో మరణించిన 54 మందికి ఓట్లు

16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె 8

ప్రాణ.. స్నేహితులే!



సీతపల్లి వాగులో పడి మృతిచెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకులు

మృత్యువూ వారి స్నేహాన్ని విడదీయలేకపోయింది.. ఎప్పుడూ ఒకరి వెంట ఒకరుగా ఉండేవాళ్లు.. మృత్యువులోనూ ఒక్కటిగానే తిరిగిరాని లోకాలకు తరలిపోయిన విషాదఘటన ఇది.. జిల్లాలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు స్నేహితులు మృతిచెందారు.. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సెలవు కావడంతో విహారయాత్రకు సీతపల్లివాగుకు వెళ్లారు.. అప్పటి వరకూ ఎంతో సరదాగా గడిపారు.. ఫొటోలు తీసుకున్నారు.. తిరిగివచ్చేసే సమయం దగ్గరపడుతుండడంతో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ముగ్గురు స్నేహితులు సీతపల్లివాగులో స్నానానికి దిగారు.. మరో ఇద్దరు గట్టుపై ఉన్నారు.. అయితే అరగంట తర్వాత స్నానానికి దిగిన ముగ్గురు నీట మునిగి మృత్యువాతపడ్డారు. మరో ఘటనలో అనపర్తికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు.. ఆదివారం కావడంతో నలుగురు యువకులు సరదాగా యానాం వెళ్ల తిరిగివస్తుండగా లారీని దాటించబోయి ఎదురుగా ఉన్న గొయ్యిలో పడి ఇద్దరూ మృతిచెందారు.. ఎప్పుడూ తమ మధ్య సరాదాగా తిరిగే ప్రాణ.. స్నేహితులు.. ప్రాణాలతో లేకపోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. - 8లో



మీకు నేనున్నా : దళిత గర్జన సభకు భారీగా హాజరైన జనం.. దళితుల సమస్యలు వింటున్న మాజీ ఎంపీ హర్షకుమార్

జగన్‌కు ఓటేయకండి..

దళిత గర్జన సభలో హర్షకుమార్



దగాపడ్డ దళితులంతా తిరగబడాలి.. సీఎం జగన్‌ను గద్దె దింపాలి.. ఐదేళ్ల కిందట ఎన్నికల ముందు దళితులకు అది చేస్తా.. ఇది చేస్తా అని హామీ ఇచ్చాడు.. చివరికి చేసిందేం లేదు.. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు మాత్రం పెరిగాయి.. అంటూ వేమగిరిలో ఆదివారం జరిగిన దళిత సింహగర్జన సభలో మాజీ ఎంపీ హర్షకుమార్ వైసీపీ ప్రభుత్వ తీరుపై గర్జించారు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఓటుకు రూ.10 వేలు ఇస్తారు.. తీస్కోండి.. ఓటు మాత్రం వైసీపీకి వేయకండని పిలుపునిచ్చారు.. ఈ సభ నాకోసం కాదు.. మీ కోసమే..ఇది దళితుల ఆత్మగౌరవ సభ అన్నారు.. - వివరాలు 8లో



7 కేజీలు రూ.100

- భారీగా దిగొచ్చిన ఉల్లి ధర
- మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతులు
- ఆటోలపై రూ.100కి ఏడు కిలోలు
- రైతు బజార్లలో మాత్రం తగ్గని ధర
- ఇంకా కిలో రూ.20లకే విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : ఉల్లిపాయల ధరలు దిగొస్తున్నాయి. గత రెండు, మూడు రోజుల నుంచి ఉల్లిపాయల ధరల్లో అనూహ్యమైన తగ్గుదల కనిపిస్తోంది. మహారాష్ట్రలో కొత్త పంట చేతికి రావడంతో డిమాండ్ కంటే ఎక్కువగా దిగుమతులు పెరడమే ధరలు తగ్గుదలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో ఉల్లిపాయల లోడు లారీలు మార్కెట్‌కు వస్తుండడంతో ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు వచ్చిన పాయలను వచ్చినట్టే బహిరంగ మార్కెట్లకు పంపిస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌కు నాలుగు, ఐదు లారీలు వచ్చేవని, ఇప్పుడు ఏకంగా పది నుంచి పదిహేను వరకూ లారీ లోడ్లు వస్తున్నాయని చెబుతున్నారు. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లోనే ధరలు నేలచూపులు చూస్తున్నాయి.

ఆటోలపై ఇంటింటికీ ఉల్లి

హోల్‌సేల్ మార్కెట్‌లోనే ఉల్లిపాయల ధర తక్కువగా ఉండడంతో ఆటోలు, తోపుడుబండ్లపై ఇంటింటికీ తీసుకొచ్చి విక్రయించే వ్యాపారులు రూ.100లకే ఏడు కిలోలు అంటూ ఊదరగొడుతున్నారు. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి పది కిలోలు రూ.90-100లకు కొనుగోలు చేసి రవాణాఖర్చులు, కొంత లాభం వేసుకుని తక్కువకే ఇళ్లవద్ద విక్రయిస్తున్నారు. అయితే రైతు బజార్లలో మాత్రం కిలో రూ.20లకు తగ్గడంలేదు. నిజానికి బహిరంగ చిల్లర మార్కెట్ల కంటే రైతుబజార్లలోనే ధరలు తక్కువగా ఉండాలి. కానీ తాము నాణ్యత కల్గిన పాయలు తెస్తున్నామని, ధర తగ్గిస్తే గిట్టుబాటు కాదని రైతు బజార్లలోని వ్యాపారులు చెబుతున్నారు.

కొత్తపాయలు నిల్వకు ఆగవు ..

మహారాష్ట్రలోని షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భారీగా ఉల్లిపాయలు మార్కెట్లకు వస్తున్నా అవన్నీ కొత్తపాయలు కావడంతో నిల్వకు ఆగే పరిస్థితి లేదు. దీంతో బస్తాలకు, బస్తాలు కొనుగోలు చేసుకుని నిల్వచేసుకునే అవకాశం ఉండదు. ఆరుదలపాయ కాకపోవడంతో త్వరగా కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. ఒకేసారి 25, 30 కేజీల కొనుగోలు చేసుకున్నా ప్రయోజనం ఉండదు. హోటళ్లు, కర్రీపాయింట్ల వారికి ఈ ధరల తగ్గుదలతో ఉపయోగం ఉంటుందని చెబుతున్నారు.



ఫ్యాన్ కింద గుబులు

తూర్పున వేడెక్కిన రాజకీయం

- టీడీపీ,జనసేన, బీజేపీ పొత్తు?
- కేడర్‌లో పెరుగుతున్న జోష్
- పెరిగిన ఆశావహుల సంఖ్య
- టీడీపీ,జనసేనలో చేరికలు
- పొత్తు తర్వాతే అభ్యర్థుల ప్రకటన
- వైసీపీ వెన్నులో వణుకు
- మరో పక్క జగనన్న బాణం దెబ్బ
- తేలని ముగ్గురి భవితవ్యం
- దిగాలు పడిన నాయకులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది.. వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ కార్యక్రమాలను వేగవంతం చేశాయి. టీడీపీ-జనసేనలతో బీజేపీ కూడా పొత్తు సిద్ధమవుతుందనే సంకేతాలతో కేడర్‌లో మరింత జోష్ పెరిగింది.దీంతో వైసీపీలో వణుకుపుడుతోంది. టీడీపీ- జనసేన పొత్తువల్లే డీలా పడిన వైసీపీ, ఇవాళ టీడీపీతో బీజేపీ కూడా కలుస్తుందనే సమాచారంతో మరింత దిగాలు పడింది. మరో పక్క పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన అన్న సీఎం జగన్‌ను ఏకి పారేస్తుండడం, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతుండంతో వైసీపీ ఆందోళనకు గురవుతుంది. వైసీపీ అభ్యర్థులను బదిలీ చేసినా..కొత్త వర్గాలను తెరమీదకు తెచ్చినా ఆయా వర్గాల్లో కూడా వైసీపీ పట్ల నమ్మకం లేకపోవడం గమనార్హం. ఇవాళ అన్ని వర్గాల్లోనూ రాజకీయ చైతన్యం పెరగడం వల్ల ఒక వర్గానికి ఇస్తే మరొక వర్గం ఇబ్బంది పడుతోంది.ఈ పరిస్థితుల్లో ప్రజలు అభివృద్ధి, శాంతిభద్రతలు, ప్రశాంత వాతావరణం, మౌలిక వసతులు కల్పించడం, విద్య, ఆరోగ్యం వంటివాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వైసీపీ అనేక సంక్షేమ పథకాలు ఇచ్చినట్టు చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఇటీవల చాగల్లులో జరిగిన రచ్చబండలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సంక్షేమ పథకాల గుట్టు రట్టు చేసిన సంగతి తెలిసిందే. అమ్మఒడి అంటే ఒకే బిడ్డకేనా, ఇంకో బిడ్డ ఉంటే చదువుకో కూడదా అంటూ జగన్ వైఖరిని తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. అసలు అమ్మఒడికింద రూ.12వేలు ఇస్తే, అది చదువుకు సరిపోతుందా అని కూడా ఆమె ప్రశ్నించారు. మట్టిబిందె ఇచ్చి, వెండి బిందె లాగేసుకుంటున్నారని విమర్శించారు. ఒక్క హామీ అమలుచేయని జగన్ వైఎస్ఆర్ వారసుడు ఎలా అవుతాడని కూడా ప్రశ్నించారు. ఇదే కోణంలో ప్రజలు ఆలోచిస్తున్నారు.ఈ పరిస్థితి వైసీపీని ఇరకాటంలో పడేసింది.వైసీపీ ఇంకా ముగ్గురు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చని సంగతి తెలిసిందే. ఇది కూడా ఆయా అభ్యర్థులు, కేడర్‌లోనూ అనుమానాలు పెంచుతోంది. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో వైసీపీ మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టినట్టయింది. కొవ్వూరు లో హోం మంత్రి తానేటి వనిత హయాంలో మాల లకు అన్యాయం జరిగిందనే కారణంతో గతంలో మాల లంతా ఒకతాటిపైకి రావడం తెలిసిందే. ఇవాళ మాదిగ వర్గానికి చెందిన మంత్రి తానేటి వనితను గోపాలపురం పంపించడంతో కొవ్వూ రులో మాదిగ వర్గం చిన్నబుచ్చుకుంది. గోపాలపురంలో ఎమ్మెల్యే మాలవర్గానికి చెందిన తలారి వెంకటరావును కొవ్వూరు తీసుకురావడంతో గోపాలపురంలో మాల వర్గం చిన్నబుచ్చుకుంది. ఇక్క డంతా తమ జాతి నాయకత్వాలను ఎదగనీయడం లేదనే ఆలోచనతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. టీడీపీలో ఇంకా అభ్యర్థులను అధికారికంగా ప్రక టించలేదు. కొన్నిచోట్ల లోపాయికారిగా సమాచారం అందినప్పటికీ చాలా చోట్ల ఇంకా ఎవరు అభ్యర్థి అనేది తేలలేదు. టికెట్లు విషయం అనేది అధిష్టానానికి సంబంధించినది. కానీ కేడర్, ప్రజలు మాత్రం అభ్యర్థి ఎవరైనా మాకు పార్టీ ముఖ్యమనే స్థాయికి వచ్చారు. రాజమహేంద్రవరం సిటీ, అనపర్తి, గోపాలపురం అభ్యర్థుల విషయంలో తెలుగుదేశం అధిష్టానం ఒక స్పష్టతకు రాగా, రాజానగరం విషయంలో జనసేన అభ్యర్థి పేరు ప్రకటించకపోయినా, అక్కడ నుంచి జనసేన పోటీ చేస్తుందనే విష యాన్ని ధ్రువీకరించింది. ఇక రాజమహేంద్ర వరం రూరల్ నుంచి ఎవరు పోటీ చేస్తారనేది అధిష్టా నం తేల్చవలసిందే. సిట్టింగ్‌లందరికీ టికెట్లు ఖాయమని చంద్రబాబు గతంలో ప్రకటించడంతో తనకే టికెట్ అని ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి చెబుతున్నారు. అంతేకాక ఇక్కడ మరో వాదన వినిపిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో నాలుగు నియోజకవర్గాల్లో కమ్మ వర్గీయులకు టికెట్లు ఇచ్చేవారు.ఇప్పటికే పెద్దాపురం,రాజానగరం నియోజకవర్గాల నుంచి కమ్మ వర్గాన్ని తప్పించారు. ఇక మండపేట, రాజమహేంద్రవరం రూరల్ ఉం ది. అందులో ఇంకొకటి కూడా తప్పిస్తే ఎలా అనే వాదన వినిపిస్తోంది.ఇక జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడు కందుల దుర్గేష్ కూడా టికెట్ తనకేనని, తనకు తమ అధినేత పవన్ కల్యాణ్ మాటిచ్చారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సీటు ఎవరిదనేది తేలడానికి మరి కొద్దిరోజులు పడుతుంది. కొవ్వూరు నియోజక వర్గంలో కూడా రెండు వర్గాల మధ్య అధిపత్య పోరు. అక్కడ కూడా అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఖరారవుతారు. నిడదవోలు మాజీఎమ్మెల్యే బూ రుగుపల్లి శేషారావు, సీనియర్‌నేత కుందుల సత్యనారాయణ మధ్య టికెట్ కోసం హోరాహోరీ పోరు నడుస్తోంది.కానీ ఇంకా అభ్యర్థుల విష యంలో స్పష్టత లేకపోయినా, జిల్లాలో టీడీపీ-జనసేన కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఐక్యంగా పనిచేస్తుండడం గమనార్హం.రాజమహేంద్రవరం సిటీలో ఆదివారం టీడీపీలో పలువురు చేశారు. పెద్దర్యాలీ నిర్వహించారు.అనపర్తి ఆది బ్యాచ్ పేరిట వందలాది మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఇప్పటికే గోపాలపురంలో కూడా భారీఎత్తున చేరికలు ఉన్నాయి. జిల్లాలో అనేక చోట్ల టీడీపీ నేతలు పార్టీ కార్యాలయాలను ఎన్నికల కోసం సిద్ధం చేసుకుంటున్నారు. బీజేపీతో పొత్తు తేలిన తర్వాతే, టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను ఒకేసారి ప్రకటిస్తారనే ప్రచారం సాగుతోంది. చంద్రబాబు హయాంలోని టీడీపీ ఆచితూచి అడుగులు వేస్తుండడంతో సీఎం జగన్ అయోమ యంలో పడుతున్నారు.ఈ నేపథ్యంలోనే టీడీపీ అభ్యర్థులను ప్రకటించే వరకూ వేచి చూస్తున్నారు.

ఆ ఇంట్లో ఏమైంది!

- కాలిన గాయాలతో తండ్రి, ఇద్దరు చిన్నారులు
- ఇంట్లో నుంచి పొగలు.. గుర్తించిన స్థానికులు
- గ్యాస్ లీకైందంటున్న తండ్రి.. భార్యతో గొడవలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య గొడవలతో అభంశుభం తెలియని చిన్నారులు నలిగిపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీకి చెందిన గూడి సాయి కిరణ్‌కి యర్రవరానికి చెందిన దుర్గతో ఆరేళ్ల కిందట వివాహమైంది.కొంతకాలంగా ఇద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొడుకు సందీప్(4), ఏడాదిన్నర కూతురితో ఆమె అమ్మ గారింటికి వెళ్లిపోయింది. గత నెల 21న అత్తగారింటికి వెళ్లిన సాయి గొడ వపడి తన ఇద్దరు పిల్లలను తీసుకొని వచ్చేశాడు. ఏమైందో ఏమో గానీ ఆదివారం అతడి ఇంట్లో నుంచి పొగరావడం గమనించి వెళ్లి భయాం దోళన చెందారు.అప్పటికే అతడు,పిల్లలు తీవ్రగాయాలతో ఉన్నారు. వాళ్ల ను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.గ్యాస్ లీకై మం టలు అంటుకున్నాయని సాయి చెప్పాడు.అయితే పిల్లలకు కాళ్లు, చేతు లు, తలపై కాలిన గాయాలున్నాయి. గ్యాస్ లీకై మంటలు వ్యాపించి నట్టుగా వారి పరిస్థితి లేదు. దీంతో సాయి కిరోసిన్ వేసి నిప్పంటించి ఉంటాడని భావిస్తున్నారు.ముగ్గురినీ మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.తల్లి దుర్గ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నారని, ఆమె నేరుగా కాకినాడ వెళ్లారని..ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఫిబ్రవరి 11 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి విశేషపూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి,నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు.అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేసారు. ఆదివారం అమ్మ వారికి మొత్తం రూ.1,74,441లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వ హణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.





పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ జగదీశ్

ఎన్నికల విధులు బాధ్యతగా చేయాలి

- లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేస్కోండి
- బోర్డర్ చెక్‌పోస్టులు బలోపేతం చేయాలి
- అవగాహన సదస్సులో ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులను ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి, ఎన్నికల ప్రక్రియలపై పోలీస్ అధికారులకు ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని వివరించాలన్నారు. గ్రామ పెద్దలతో శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి,సారా,మద్యం, నగదు తదితర వాటి రవాణా అరికట్టడానికి బోర్డర్ చెక్‌పోస్టులను బలోపేతం చేయాలన్నారు. ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి వాటి నుంచి ఎన్నికల అధికారులు, ఓటర్లకు భద్రత కల్పించాలని తెలిపారు. లైసెన్స్‌లేని ఆయుధాలు, మందుగుండు సామగ్రి సీజ్ చేయాలన్నారు. రౌడీ షీట్లు,పరారీలో ఉన్న నేరస్తులు, దూకుడుగా వ్యవహరించే కార్యకర్తలు, కుల/ మతపరమైన వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ శాఖలోని అందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో కేసుల నమోదు, కోర్టు ముందు ఉంచే ప్రక్రియ తదితర విషయాలపై ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఎస్ ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు,సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలల పండుగ



బాలికకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ కమిషనర్ జితేంద్ర

- ఉత్సాహంగా గోదావరి బాలోత్సవం
- రెండు రోజుల పాటు పిల్లలకు పండగే
- హాజరైన 5600 మంది చిన్నారులు
- అన్ని విభాగాల్లో అలరించారు..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 11 : విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన గోదావరి బాలోత్సవం పిల్లల పండుగ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ మాజీ కమిషనర్ ఎం.జితేంద్ర మాట్లాడుతూ మంచి సమాజం కోసం అవసరమైన మానవ వనరులు అందించేందుకు ఇలాంటి బాలోత్సవాలు ఎంతో అవసరమన్నారు. నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్, శ్రీ వెంకటేశ్వరా ఫైనాన్స్ అధినేత వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతను పెంచుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఎస్ఎస్ఎస్ శర్మ, ఎల్ఐసీ ఏవో ఆర్.రామ్మోహనరావు, కవి అరిపిరాల నారాయణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలను నాటడం ద్వారా సమాజాన్ని కాపాడుకోవడానికి దోహదపడాలని సూచించారు. గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి రెండు రోజుల పాటు జరిగిన వివిధ పోటీల్లో 5,600 మంది పాల్గొని తమ ప్రతిభ చాటారన్నారు. రెండో రోజున కూడా కల్చరల్, అకడమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. క్లాసికల్, జానపద నృత్యాలు, కోలాటం, మట్టితో బొమ్మల తయారీ వంటి పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజేతలకు మెడల్స్, మెమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని అమరావతి బాలోత్సవం నిర్వాహకులు టి.క్రాంతికుమార్, సంఘసేవకులు మాటూరి సిద్ధార్థ, భాస్కర్, డాక్టర్ చైతన్యశేఖర్, బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణకుమార్ పర్యవేక్షించారు.



బాలోత్సవం పోటీల్లో విజేతలకు మెమొంటో అందజేస్తున్న జితేంద్ర తదితరులు



బాలోత్సవంలో కోలాటం పోటీలకు హాజరైన బాలికలు

వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నిడదవోలులో వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

నిడదవోలు, ఫిబ్రవరి 11: నిడదవోలులోని వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. అధ్యక్షుడిగా భాస్కర్ల రాజారామ్మోహన్‌రాయ్, కార్యదర్శిగా చెన్నాపరపు రాజశేఖర్, ట్రెజరర్‌గా అద్దాల సాయిలక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే గాంధీనగర్ వాకర్స్‌క్లబ్, మహిళా వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకా రాన్ని స్థానిక రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆవరణలో నిర్వహిం చారు. అధ్యక్షుడిగా కండవల్లి మాణిక్యాలరావు, సెక్రటరీగా బి.యుగంధర్‌కుమార్, ట్రెజరర్‌గా ఎన్‌వీఎల్ నారాయణ, మహిళా అధ్యక్షురాలిగా కె.సూర్యకాంతం, కార్య దర్శిగా కండవల్లి లక్ష్మీ, ట్రెజరర్‌గా ఎ.లక్ష్మీ మంగతాయారు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వాకర్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.మురళీమోహనరావు, సెక్రటరీ వి.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో నైపుణ్యాలు మెరుగు

కొవ్వూరు, ఫిబ్రవరి 11: ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వర్కుషాప్‌లు, సెమినార్‌లు దోహదపడతాయని ఏబీఎన్ పీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. ఆదివారం కళాశాల కామర్స్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ఆన్ క్యాపిటల్ మార్కుట్ ప్రోడక్ట్స్ పేరుతో ఏర్పాటుచేసిన వర్కుషాపును ప్రారంభించారు. నన్నయ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవిశంకర్ జెట్టి ముఖ్యఅతిథిగా విచ్చేసి కామర్స్ అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామర్స్ హెడ్ కె.రామకృష్ణ, నయీమ్‌బేగ్, కె.కృష్ణకిషోర్, డీబీఆర్ కుమార్, వి.దామ్సన్ పాల్గొన్నారు.

కొవ్వూరు అభివృద్ధికి కృషి : తలారి


కొవ్వూరు చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు, ఫిబ్రవరి 11: కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఆదివారం కొవ్వూరులోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1వ వార్డు రాజీవ్‌కాలనీలో మత్స్యకారులను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కంటమణి రమేష్‌బాబు, రుత్తల భాస్కరరావు, పిక్కి శ్రీనివాస్, బావన రాజేష్ (బెన్ని), ముళ్లపూడి కాశి పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణం

తాళ్లపూడి, ఫిబ్రవరి 11: మండలంలోని పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడులో ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. గ్రామంలోని కొలిశెట్టి వారు పుట్టింటి వారుగానూ చీకట్ల వారు అత్తింటి వారుగానూ భావిస్తూ గ్రామ దేవత కార్యక్రమాలు చేపడుతుంటారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావుతోపాటు పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏపీ లిక్కర్స్ యూనియన్ సమావేశం

నిడదవోలు, ఫిబ్రవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా బ్రాందీ షాపుల్లో పని చేస్తున్న వారిని వైసీపీ ప్రభుత్వం రోడ్డున పడేసిందని లిక్కర్‌షాపు యూనియన్ నాయకులు అన్నారు. ఆదివారం నిడదవోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ లిక్కర్స్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ళలో లిక్కర్‌షాపు వర్కర్స్ జీవితం దుర్భరంగా మారిందన్నారు. మరి కొంతమంది బతకలేక ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. తమ గోడు విన్నవించేందుకు చలో విజయవాడ పిలుపునిస్తే అక్రమ అరెస్టులు, కేసులు నమోదు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.సుధాకర్, ఉపాధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్‌ఖాన్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 11: కొవ్వూరులోని టిడ్కో గృహాల సముదాయం సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కె.జగదీశ్వరరావు ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి రూ.2430 స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కోడి పందాల స్థావరంపై దాడి

కొవ్వూరు, ఫిబ్రవరి 11: కోడి పందాల స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు. ఆదివారం మండలంలో పెనకనమెట్ట సావరం శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడిచేశామని, నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.1250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు ఏపీ ఆదర్శం

మంత్రి చెల్లుబోయిన వేణు


శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి వేణు

రాజానగరం, ఫిబ్రవరి 11: మహిళా సాధికారతకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని బీసీ సంక్షేమశాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. రాజానగరంలో ఆదివారం సాయంత్ర నిర్వహించిన ఆడపడుచుల ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో మహిళల అప్పులన్నీ తీరుస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని సీతానగరం రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేశామన్నారు. ఇంటింటికీ గోదావరి జలాలను సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీలు వరదు కళ్యాణి, పోతుల సునీత, వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాజమహేంద్రవరం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అంకాలమ్మ జాతర మహోత్సవాలు

రాజానగరం, ఫిబ్రవరి 11: ప్రగడ వంశీయుల ఇలవేల్పు నరేంద్రపురంలో శ్రీఅంకాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాఘమాసంలో రెండేళ్లకోసారి ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారి మహిమలపై పంబనాదం కథను గానామృతం చేస్తారు. రాష్ట్రంలోని ప్రగడ వంశీయులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం ఆలయార్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రగడ రాంబాబు, ప్రగడ ఏకాశిబాబు, నాయకులు పంపన శ్రీనివాస్, ప్రగడ రామచంద్రరావు, ప్రగడ వీరబాబు, శివన్నారాయణ పాల్గొన్నారు.

కూడగట్టేది టీడీపీ.. కూల్చేది వైసీపీ

» తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జవహర్


గోపాలపురంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జవహర్, మద్దిపాటి

గోపాలపురం, ఫిబ్రవరి 11: రాష్ట్రాన్ని దశల వారిగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి కూడగట్టే నైజం తెలుగుదేశం పార్టీదని, అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి భవనాల మొదలుకుని నీడనిచ్చే చెట్ల వరకు కూల్చేనైజం వైసీపీ పార్టీదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్.జవహర్ అన్నారు. గోపాలపురంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేకుకోసి కార్యకర్తలకు పంచి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జవహర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేసే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పని చేసి మద్దిపాటిని గెలిపించాలని అన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో తానేటి వనిత మంత్రి హోదాను అడ్డు పెట్టుకుని ఇసుక ర్యాంపులు, మైనింగ్, మద్యం, ఇతర శాఖ నుంచి రూ.500 కోట్లు సంపాదించారని జవహర్ ఆరోపించారు. మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ఎన్నికలకు మిగిలింది 60రోజులేనని, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలింపించాలన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దళితులను మోసం చేసి అధికారాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు అప్పగించి ఫోన్‌కే పరిమితమైన హోం మంత్రిని హోంకే పరిమితం చేయాలన్నారు. ఈ సందర్భంగా భీమోలు, తొక్కిరెడ్డిగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, దొండపూడి, వెంకటాయిపాలెం గ్రామాల నుంచి వైసీపీకి చెందిన 500మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో తెలుగుమహిళా మండలాధ్యక్షురాలు కాకర్ల రామతులసి, కొర్లపాటి రాము, మెంతిమి అమరావతి, నూతంగి దొరబాబు, వడ్లమూడి రమేష్, కొర్లపాటి రాము పాల్గొన్నారు.


పెండ్యాలలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి, భోగవల్లి ప్రసాద్

జనంలోనే టీడీపీ-జనసేన

నిడదవోలు, ఫిబ్రవరి 11: ప్రతిక్షణం జనసేన తెలుగుదేశం పార్టీలు ప్రజల పక్షానే పోరాడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీఎస్ఎన్ భోగవల్లి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని పెండ్యాలలో జనంలోకి టీడీపీ-జనసేన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం రెండు పార్టీలు కలసి పోరాడుతున్నాయని, రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రెండు పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరణించిన 54 మందికి ఓట్లు

తప్పుల తడకగా ఓటరు లిస్టులు: కొమ్మిన

నిడదవోలులో తప్పుల తడకగా ఓటరు లిస్టులు తయారయ్యాయని టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో అయన మాట్లాడుతూ 43వ పోలింగ్‌బూత్‌లో 54 మంది మరణించిన వారికి ఓట్లు ఉన్నాయని అలాగే మరో ఏడుగురికి డబుల్ ఎంట్రీలు ఉన్నాయన్నారు. వాటిని తొలగించాలని అధికార్లకు వినతిపత్రం అందించినా నేటికి తొలగించలేదన్నారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు లిస్టులను ఎన్నికల అధికార్లు తక్షణం సరిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

సరదా కోసం వెళ్లి తిరిగి రాని లోకాలకు..

» యర్రపోతవరం లాకుల వద్ద రోడ్డు ప్రమాదం

» ఇద్దరు యువకుల మృతి


యర్రపోతవరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జానీ, ప్రసాద్

కె.గంగవరం/అనపర్తి, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని యర్రపోతవరం లాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పామర్రు ఎస్.ఐ. జానీ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం అనపర్తి సావరంకు చెందిన దుర్గాడ జానీ(26), లక్ష్మీనరసాపురంకు చెందిన పిల్లి ప్రసాద్(28)లు మరో ఇద్దరు స్నేహి తులతో కలసి ఆదివారం ఉదయం యానాం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి యానాం నుంచి అనపర్తి వెళుతున్న సందర్భంలో యర్రపోతవరం లాకుల వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జానీ, ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ. పి.దొరరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించామన్నారు. ప్రసాద్, జానీ మరణంతో రెండు కుటుంబాలు వారు కుటుంబ పెద్దలను కోల్పోయారు. వీరిలో జానీకి చదువుకుంటున్న తమ్ముడు, ప్రసాద్‌కు పెళ్లీడుకు వచ్చిన చెల్లెలు ఉన్నారు. వీరి మరణం తో అనపర్తి సావరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

రెండు కుటుంబాల్లో విషాదం

ఆదివారం పనికి సెలవు కావడంతో స్నేహితులు సరదాగా గడిపేం దుకు యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పాయారు. చేతికందిన కొడుకులు ప్రాణాలు కోల్పోవడంతో రెండు కుటుంబాలలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. అనపర్తి మండలం లక్ష్మీనరసాపురానికి చెందిన పిల్లి ప్రసాద్(26), అనపర్తి సావరంనకు చెందిన దుర్గాడ జానీ(28) స్నేహితులు. ఇద్దరూ అవివాహితులే.. తాపీ పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇద్దరికీ తండ్రులు లేకపోవడంతో రెండు కుటుంబాలకు వారే ఆధారం కావడంతో రెండు కుటుంబాల వారు అనాథలుగా మిగిలారు. ఆదివారం తాపీ పనికి సెలవు కావడంతో ఇద్దరూ మోటారుసైకిల్‌పై యానాం వెళ్లి సరదాగా గడిపారు. తిరుగు ప్రయాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులవద్దకు చేరుకునే మోటార్‌సైకిల్.. లారీని ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. భర్తలు లేరు.. కడవరకు తమను చూసుకుంటారని గంపెడు ఆశలు పెట్టుకున్న ఆ తల్లులు.. కుమారులు అర్థాంతరంగా తమను విడిచి వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు యువకుల మృతితో రెండు గ్రామాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె

రాజానగరం, ఫిబ్రవరి 11: ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌లను జయప్రదం చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆదివారం సూర్యారావుపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రదర్శన, ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు మాట్లాడుతూ ఏఐకేఎంఎస్, కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా కిసాన్ మోర్చా వివిధ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు రైతాంగం, కార్మికులపై మోయలేని భారం మోపుతూ వారి హక్కులను కాలరాస్తున్నాయన్నారు. వీటిని ప్రతిఘటించేందుకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు మరుకుర్తి వీరలక్ష్మి, నక్కా లక్ష్మి, దుర్గ, తోటకూర జేబీరాణి, గున్నూరు అరవాలమ్మ, తామర్ల గౌరి పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

కొవ్వూరులో 14 మంది దంపతులతో హోమం


కొవ్వూరులో హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

కొవ్వూరు, ఫిబ్రవరి 11: కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఆదివారం ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు(నాని) పర్యవేక్షణలో అమ్మవారికి సహస్రనామార్చన చేశారు. 14 మంది దంపతులతో సామూహిక కుంకుమార్చన, అమ్మవారి ఆత్మార్పణ హోమ కుండలతో హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మద్దుల సత్యనారాయణ, నాళం శ్రీనివాసరావు, కక్కిరాల సూరిబాబు, తుమ్మలపల్లి నాగరమేష్, కక్కిరాల వీరభద్రరావు, దేవతు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవి వనితాక్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలులోని చిన కాశీరేవులో వాసవి కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో 102 దీపాలు వెలిగించి అమ్మవారికి చీర జాకెట్టు, పసుపు కుంకుమ గాజులు పండ్లు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు సింహాద్రి శిరీష, గొల్లపూడి గాయత్రి, అనంత శిరీష, దివ్వెల ఫణిమాధురి, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యనారాయణుడికి పంచామృత అభిషేకాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 11: స్థానిక సంస్కృత పాఠశాలలో శ్రీలలితాపార్వతి సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మాఘమాసం మొదటి ఆదివారం సందర్భంగా ఆలయార్చకులు స్వామికి ప్రత్యేకపూజలు, పంచామృత అభిషేకాలు, సూర్యనమస్కారాలు చేశారు. అలాగే గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సూర్యనారాయణునికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, ఫిబ్రవరి 11: స్థానిక పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయార్చకులు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన అప్పల అయ్యపరాజు, శ్రీరామలత దంపతులు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, కుంకుమ పూజ, లక్ష బిల్వార్చన నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో పలువురు అర్చకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ మళ్లీ వస్తే బతకలేం

» దళితులను ఇంత నీచంగా చూసిన ముఖ్యమంత్రిని చూడలేదు

» దగా పడ్డ దళితుల ఆత్మగౌరవ పోరాటమే సింహగర్జన

» బీసీలకు తగ్గకుండా కాపుల రిజర్వేషన్లకు మద్దతిస్తాం

» అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్

» వేమగిరిలో దళిత సింహ గర్జన సభ


సభలో ప్రసంగిస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ/కడియం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళితులు దగా పడ్డారని, వారి ఆత్మగౌరవ పోరాటమే ఈ సింహగర్జన సభ అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలో వేమగిరి జాతీయ రహదారి వద్ద మైదానంలో ఆదివారం సాయంత్రం జగన్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తూ ఆయన దళిత సింహగర్జన సభను నిర్వహించారు. విజయనగరం నుంచి అనంతపురం వరకు, ఆంధ్రాతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి దళితులు హాజరయ్యారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవనరామ్‌లకు నివాళులర్పించారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ పోరాడితే పోయేది లేదు.. బానిస సంకెళ్లు తప్ప అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం జగన్ దళితులను నమ్మించారని, క్రైస్తవులు నమ్మి జగన్‌ను అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. అయితే మణిపూర్‌లో క్రైస్తవులపై మారణ కాండ సృష్టిస్తే ఈ సీఎం కనీసం స్పందించలేదని, పైగా ఆనాడు అవిశ్వాసం పెడితే కేంద్ర ప్రభుత్వానికి ఈ వైసీపీ ఎంపీలు ఓటు వేశారని గుర్తు చేసారు. దేశంలో దళితులను ఇంత నీచంగా చూసిన జగన్ లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో బక్కి శ్రీను మొదలు డ్రైవరు సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, గుంటూరులో రమ్య, అనంతపురంలో స్నేహలత, పులివెందులలో నాగమ్మ, కడపలో డాక్టర్, దొమ్మేరులో మహేంద్ర, నడింపల్లి రాము హత్యాకాండలు.. అలానే మైనింగ్‌ను ప్రశ్నించిన వరప్రసాద్ శిరోముండనం సంఘటన ఇలా చెపుతూ పోతే చాలా మంది దళితులు బలయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారని, దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారని, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు లేకుండా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దళితులకు దక్కాల్సిన రూ.75 లక్షల కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాత్ర సినిమా చేసిన దర్శకునికి రెండెకరాల భూమి ఇచ్చిన ఈ ప్రభుత్వం బాధిత దళితులకు భూమిని కేటాయించలేకపోయిందని విమర్శించారు. అమ్మఒడి పథకానికి సబ్‌ప్లాన్ నిధులను ఖర్చుచేశారన్నారు. బెస్ట్ ఎవలైబుల్ స్కీంను రద్దు చేసిందని, ఇంత మంచి స్కీంను తీసివేయడంపై సుప్రీంకోర్టు స్పందించి పునరుద్ధరించాలని చెప్పిందన్నారు. కులాంతర వివాహం స్కీంను జగన్ రద్దు చేశాడని గుర్తుచెశారు. ఎస్ఎస్‌సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గతంలో కార్లు ఇచ్చేవారని అది లేదని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. లక్ష సబ్సిడీ వచ్చేదని అదీ రద్దు చేశాడని ధ్వజమెత్తారు. దళితులను దగా చేసిన ఈ ముఖ్యమంత్రి మళ్లీ వస్తే దళితులు బతకలేరని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులంతా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తే తీసుకోండి.. ఎందుకంటే అది ఇసుక, మద్యం, కొండలు దోచేసిన డబ్బే కదా... కాని జగన్‌కు ఓటు వేయొద్దన్నారు. జగన్‌ను దించే వరకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలో బీసీలకు తగ్గించకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. తొలుత ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేత జార్జి సీమంతుల మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని హర్షకుమార్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నామన్నారు. జగన్.. పాస్టర్లకు గౌరవ వేతనం అంటూ 29 వేల మందిని గుర్తించి కేవలం 8 వేల మందిని ఎంపిక చేశారన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ అని పెట్టి చర్చిలు కడతామని మాట ఇచ్చి ఒమ్ము చేశారన్నారు. జంగా బాబూరావు మాట్లాడుతూ దళితులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, అభివృద్ధి కుంటుపడిందన్నారు. దళిత సత్తా అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ దళిత సైన్యం సిద్ధంగా ఉందని, జగన్ అంతం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు బక్కి శ్రీను భార్య, నడింపల్లి గంగమ్మ తదితరులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. జీవీ శ్రీరాజ్ మాట్లాడుతూ దళిత సింహగర్జన సభలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై అమరావతిలో ఓ సమావేశం పెడతామని అటుపై గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. సభలో ఏలూరు మాల మహాసేన అధ్యక్షుడు రవికుమార్, బొజ్జా ఐశ్వర్య, నడింపల్లి గంగమ్మ, ఐతాబత్తుల సుభాషిణి మాట్లాడారు. సభలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన దళిత నాయకులు చిట్టిరాజు, హైదరబాదు గుడిమెళ్ళ వినోద్, కప్పల వెలుగు, శ్యాంబాబు, సింగపల్లి రమేష్, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి విజయ్‌కుమార్, గెడ్డం వెంకట్రాజు, ఇసుకపట్ల వెంకటరమణ, జి.శ్రీను, కరుణాకర్, శ్యాంసుందర్, విజయనగరం ఆదాల మోహన్, బండి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.


సభకు హాజరైన దళిత ప్రజానీకం


విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు

విషాద యాత్ర

» సీతపల్లి వాగులో పడి ముగ్గురు విద్యార్థులు మృతి

» రంపయర్రంపాలెంలో విషాదఛాయలు


కాకర వీరవెంకటఅర్జున్


లావేటి రామన్‌జీ


అండిబోయిన దేవిచరణ్

గోకవరం, ఫిబ్రవరి 11: విహారయాత్ర విషాదంగా మారింది. సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. కన్నవారికి తీవ్ర శోకాన్ని మిగిల్చారు. వివరాల్లోకి వెళ్తే.. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన కాకర వీరవెంకటఅర్జున్(15), అండిబోయిన దేవిచరణ్(15), లావేటి రామన్‌జీ(15), తోపాటు మరో ఇద్దరు విద్యార్థులు రంపయర్రంపాలెంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఈ ఐదుగురు రెండు మోటారుసైకిళ్ళపై విహారయాత్రకంటూ ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రంపచోడవరం మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద కాసేపు సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. 3-4గంటల మధ్య అర్జున్, దేవిచరణ్, రామన్‌జీ స్నానం చేసేందుకు వాగులోకి దిగారు. కొద్దిసేపటికి వారి జాడ కనిపించకపోవడంతో గట్టున ఉన్న ఇద్దరు గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న రంపయర్రంపాలేనికి చెందిన మరికొందరు పర్యాటకులు విషయం తెలుసుకొని వారి కోసం వెతకడం ప్రారంభించారు. సమీపంలో ఉన్న ఈతగాళ్లు వాగులోకి దిగి గాలించగా ముగ్గురి మృతదేహాలు బయట పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గ్రామంలో విషాద ఛాయలు

విహారయాత్రకు వెళ్లిన ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సీతపల్లి వాగులో పడి మృతి చెందడంతో రంపయర్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మధ్యాహ్నం వరకు కళ్ల ముందే కలియదిరిగిన ముగ్గురు విద్యార్థులు వాగులో పడి మృతి చెందారన్న విషాదవార్తను గ్రామస్థులను కలిచివేసింది. గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. గ్రామస్థుల్లో చాలామంది విద్యార్థుల మృతదేహాలను చూసేందుకు రంపచోడవరం ప్రభుత్వాసుపత్రి వద్దకు వెళ్లారు.

తీవ్ర శోకాన్ని మిగిల్చారు

మనం తిన్నా తినకపోయిన పదో తరగతి వరకు చదివించాం. ఇంకో రెండు, మూడేళ్లు ఏదో రకంగా కష్టపడి చదివిస్తే మనకు అండగా ఉంటారనుకున్నామని, ఇంతలోనే తమ ఆశలపై నీళ్లు చల్లి తీవ్ర శోకాన్ని మిగిల్చారంటూ మృతుల తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. కాగా అర్జున్ తండ్రి కాకార విష్ణు రేషన్‌షాపు డీలర్. దానిపైన వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ జరుగుతోంది. దేవిచరణ్ తండ్రి అండుబోయిన అప్పారావు వ్యవసాయ కూలి. ఏపూటకాపూట కూలిపనికి వెళ్తేనే గాని జీవనం సాగదు. రామన్‌జీ తండ్రి సత్తిబాబు కూడా వ్యవసాయ కూలీనే. ఇతను కూడా పనికి వెళ్తేనే ఆ కుటుంబంలోని అందరు కడుపులు నిండుతాయి.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజీమాల్ వై.స్ర్కీన్1	కిస్మత్, బూట్‌కట్ బాలరాజు
వై.స్ర్కీన్2	గేమ్ ఆన్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్

నిడదవోలు

వీ మ్యాక్స్	లాల్ సలామ్
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	ఈగల్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్